ప్రాజెక్టుల నీటిమట్టం

ప్రాజెక్టు	పూర్తిస్థాయి	ప్రస్తుతం	ఇన్‌ఫ్లో	అవుట్‌ఫ్లో
	నీటి మట్టం (అడుగులు)		(క్యూసెక్కులు)	
సాగర్ (టీఎంసీలు)	590 (312.5050)	505.00 (123.3370)	నిల్	9,212
మూసీ (టీఎంసీలు)	645 (4.46)	638.70 (2.93)	560.29	నిల్
పులిచింతల (టీఎంసీలు)	175 (45.77)	99.99 (0.75)	490	నిల్

చికెన్ ధరలు | లైవ్ : రూ.132 | డ్రెస్ : రూ.192 | స్కిన్‌లెస్ : రూ.220



రైతు రుణమాఫీలో గందరగోళం

» రూ.లక్ష లోపు బాకీ ఉన్నా మాఫీ జాబితాలో కనిపించని పేర్లు » పనిచేయని ఫిర్యాదుల స్వీకరణ ఫోన్ నంబరు

పార్లమెంటు ఎన్నికల ముందు ఆగస్టు 15లోపు రైతులకు రూ.2లక్షల రుణమాఫీ చేస్తామని చెప్పిన ప్రభుత్వం మూడు విడతలుగా మాఫీ చేసేందుకు ఈ నెల 18న శ్రీకారం చుట్టింది. తొలుత రూ.లక్ష, రెండో విడత రూ.1.50లక్షలు, మూడో విడత రూ.2లక్షలు మాఫీ చేస్తామని ప్రభుత్వం ప్రకటించింది. ఈ నెల 18న రూ.లక్ష వరకు రుణమాఫీని సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించారు. రూ.లక్ష రుణమాఫీ నిధులు రైతుల ఖాతాల్లో జమ చేసేందుకు బ్యాంకర్లకు ప్రభుత్వం నుంచి జాబితా అందింది. శుక్రవారం పలువురు రైతులు బ్యాంకు వద్దకు వెళ్లి విచారించగా, బ్యాంకు అధికారులు వారి రుణం మాఫీ కాలేదని చెప్పడంతో ఎందుకు అవ్వలేదని అధికారులను ప్రశ్నించారు. తమకేమీ తెలియదని అధికారులు చెప్పగా, రైతులు ఆందోళన చెందుతున్నారు.

- మోత్కూరు, చిట్యాలరూరల్, పెద్దఅడిశర్లపల్లి

ఉమ్మడి నల్లగొండ జిల్లా వ్యాప్తంగా డీసీసీబీ పరిధిలో 89 వేల మంది రైతులకు రూ.499.15కోట్ల రుణమాఫీ కావాల్సి ఉండగా ప్రస్తుతం 33,913మందికి రూ.143.11కోట్లు మాఫీ అయ్యాయంటున్నారు. సహకార సంఘాల్లో రూ.లక్ష వరకు రుణం ఉన్నవారే ఎక్కువగా ఉంటారు. రూ.లక్ష పైన బాకీ ఉన్న రైతులు తక్కువ సంఖ్యలో ఉంటారు. ఆత్మకూరు(ఎం) సింగిల్ విండోలో 719 రైతులు రుణాలు తీసుకోగా, అందులో 566 మంది రూ.లక్ష లోపు రుణం తీసుకున్న వారు ఉన్నారు. అందులో కేవలం 239 మంది రైతులకు రూ.90,57,574 మాఫీ వచ్చినట్టు చెబుతున్నారు. మోత్కూరు సింగిల్ విండోలో 876 మంది రుణాలు తీసుకున్న రైతులు ఉండగా, అందులో సుమారు 700 మంది రైతులు రూ.లక్ష లోపు బాకీ ఉన్న వారు ఉన్నారు. అందులో 238 మంది రైతులకు రూ.1,12,39,964 మాఫీ వచ్చినట్టు చెబుతున్నారు. అడ్డగూడూరు సింగిల్ విండోలో 1,070 మంది పేర్లు రుణమాఫీ కోసం పంపగా 479 మంది రైతుల పేర్లు తాజా జాబితాలో ఉన్నాయి. తుంగతుర్తి సింగిల్ విండోలో 1,111 మందికి రుణమాఫీ కావాల్సి ఉండగా, 507 మంది పేర్లు మాత్రమే జాబితాలో వచ్చాయి. కొన్ని సింగిల్ విండోల్లో ఎక్కువగా, మరికొన్ని సింగిల్ విండోల్లో తక్కువ మంది రైతులకు రుణమాఫీ కావడమేంటని పలువురు రైతులు ప్రశ్నిస్తున్నారు. చిట్యాల మండలంలో వెలిమినేడు పీఏసీఎస్‌లో 283మందికి గాను 142మందికి మాత్రమే రుణమాఫీ జరిగింది. గుండ్రాంపల్లి పీఏసీఎస్‌లో 270మందికిగాను 151మందికి రుణమాఫీ జరిగింది. చిట్యాలలో 101మందికి గాను 48మందికి రుణమాఫీ జరిగింది. వట్టిమర్తి కెనరా బ్యాంకులో 288మంది పేర్లు జాబితా ఉండగా, 175మందికే రుణమాఫీ జరిగింది. సాంకేతిక కారణాలతో రుణమాఫీ జరగలేదని తెలుస్తోంది.

పని చేయని ఫిర్యాదుల నెంబర్

రుణాలు మాఫీకాని వారు ఫిర్యాదు చేయడానికి జిల్లా ఉన్నతాధికారులు టోల్‌ఫ్రీ నెంబరు ఇచ్చారు. సింగిల్ విండో కార్యాలయాల ఎదుట ఫిర్యాదుల నెంబరు 8685293312గా ఓ కాగితాన్ని గోడకు అంటించారు. రైతులు ఆ నంబరుకు ఫోన్ చేస్తే ఈ నంబర్ పనిచేయడం లేదు.

రేషన్‌కార్డు వేరుగా లేనందున మాఫీ కాలేదా?



నాకు 1.10 ఎకరాల భూమి ఉంది. కుటుంబం నుంచి విడిపోయి నేను వేరుగా వ్యవసాయం చేసుకుంటున్నా. పెట్టుబడి కోసం మోత్కూరు రైతు సేవా సహకార సంఘంలో సుమారు రెండేళ్ల క్రితం రూ.35వేలు అప్పు తీసుకున్నా. పదేళ్లుగా కొత్త రేషన్ కార్డులు ఇవ్వక పోవడంతో నా కుటుంబానికి కొత్త రేషన్ కార్డు రాలేదు. నా పేరు మా అమ్మనాన్నల రేషన్‌కార్డులోనే ఉంది. నా భార్య పేరు రేషన్‌కార్డులోకి ఎక్కలేదు. రూ.లక్ష వరకు చేసిన రుణమాఫీ జాబితాలో నా పేరు లేదు. వేరు రేషన్ కార్డు లేనందునే రాలేదేమోనని అధికారులు అంటున్నారు. రేషన్‌కార్డుతో లింకు పెట్టకుండా రుణమాఫీ చేయాలి.

- వారాల సురేష్, రైతు, మోత్కూరు

రూ.39వేల రుణం మాఫీ కాలేదు



చిట్యాల మండలంలోని గుండ్రాంపల్లి నాగార్జున గ్రామీణ బ్యాంకులో రూ.39వేల రుణం తీసుకున్నా. ఇది మాఫీ కాలేదు. నా భర్త సత్తయ్య పేరున అదే బ్యాంకులో రూ.29వేల వ్యవసాయ రుణం ఉండగా, అది మాఫీకాలేదు. ప్రభుత్వం రూ.1లక్ష లోపు రుణం ఉన్నవారివి మాఫీ చేస్తున్నామని ప్రకటించినా మాకు మాత్రం మాఫీ కాలేదు.

- గోపగోని ఆండాలు, రైతు, సుంకెనపల్లి

ప్రభుత్వ మార్గదర్శకాలే పాటిస్తున్నారా?

సీఎం రేవంత్‌రెడ్డితో పాటు మంత్రులంతా రేషన్‌కార్డును ప్రామాణికంగా తీసుకోవడం లేదని, పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2లక్షల రుణమాఫీ చేస్తున్నామని చెబుతున్నా, బ్యాంకులకు వచ్చిన జాబితాలు పరిశీలిస్తే ప్రభుత్వం గతంలో విడుదల చేసిన మార్గదర్శకాలనే పాటిస్తున్నట్టుందని పలువురు వాపోతున్నారు. వేరుగా ఉంటున్నా, రేషన్‌కార్డులో ఉన్న సభ్యులందరినీ కలిపి ఒకే కుటుంబంగా పరిగణిస్తుండవచ్చని, పీఎం కిసాన్ నిబంధనలు రుణమాఫీకి కూడా పాటిస్తున్నట్టుందని పలువురు అధికారులు చెబుతున్నారు. ఒక కుటుంబంలో ఒక్కరి పేరునే బాకీ ఉన్నా మాఫీ రాలేదంటున్నారు. అందులో మర్మమేమిటో నని రైతులు ప్రశ్నిస్తున్నారు. ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు పట్టాదారు పాస్‌పుస్తకం ఉన్న రైతులందరికీ రూ.2లక్షలు రుణమాఫీ చేయాలని, భార్యాభర్తలిద్దరినే కుటుంబ సభ్యులుగా పరిగణించాలని, వేరుగా ఉంటున్న కుమారులకు కూడా రుణమాఫీ వర్తింపజేయాలని రైతులు కోరుతున్నారు.

ప్రజా సేవే పరమావధిగా పని చేయాల్సిన ప్రభుత్వ ఉద్యోగులు లంచావతారులుగా మారుతున్నారు. ప్రభుత్వం నుంచి వేతనాలు తీసుకుంటునే సులువుగా డబ్బు సంపాదించేందుకు అడ్డదారులు తొక్కుతున్నారు. అవినీతి రహిత సమాజాన్ని నిర్మించి ప్రజలకు ఆదర్శంగా నిలవాల్సిన వారే లంచం తీసుకుంటూ ఏసీబీ కి చిక్కుతున్నారు. ఏటా ఏసీబీకి దొరుకుతున్న అవినీతి అధికారుల చిట్టా పెరుగుతూ ఉంది. గత ఏడాది ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముగ్గురు అధికారులు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కగా, ఈ ఏడాది ఏడు నెలల కాలంలోనే 10 మంది అధికారులు ఏసీబీకి రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. తాజా గా, శుక్రవారం సూర్యాపేట జిల్లా మత్స్యశాఖ అధికారి రూప్‌సింగ్ రూ.25వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

- సూర్యాపేట క్రైం, నల్లగొండ క్రైం



అవినీతి జలగలు

» రెండేళ్లలో ఏసీబీకి పట్టుబడ్డ 13 మంది ఉద్యోగులు

» ఏడు నెలల్లోనే 10 మంది చిక్కిన వైనం

» తాజాగా సూర్యాపేట జిల్లా కేంద్రంలో మత్స్యశాఖ అధికారి

ప్రభుత్వ కార్యాలయాల్లో కింది స్థాయి ఉద్యోగుల నుంచి పైస్థాయి అధికారుల వరకు కాసులు ఇవ్వనిదే కనికరించడం లేదు. ప్రసవించాలంటే ఆసుపత్రుల్లో, జనన, మరణ ధ్రువీకరణ పత్రాల కోసం మునిసిపాలిటీలు, విద్యుత్ మీటర్, ట్రాన్స్‌ఫార్మర్ కోసం ట్రాన్స్‌కో, రైతులకు పాస్‌పుస్తకాలు కావాలంటే రెవెన్యూశాఖతో పాటు ప్రతీ శాఖలో అవినీతిపరులు ఉన్నారు. ఏసీబీకి పట్టుబడుతున్నవారు కొందరే అయితే పట్టుబడని వారు ఎందరో ఉన్నారు. ఓ పక్క ఏసీబీకి పట్టుబడుతున్నా ఉద్యోగుల తీరులో మాత్రం మార్పు కనిపించడం లేదు.

అవినీతి అంతం ప్రతీ ఒక్కరి బాధ్యత

అవినీతిని నిర్మూలించడం సమాజంలోని ప్రతీ ఒక్కరి బాధ్యత. లంచం తీసుకోవడం ఎంత నేరమో, ఇవ్వడం కూడా అంతే నేరం. సమాజంలో అవినీతి కనిపించినప్పుడు దాన్ని అడ్డుకోవడం కనీసన పౌరుడి బాధ్యతగా ప్రతీ ఒక్కరు గుర్తించాలి. అప్పుడే అవినీతిని నిర్మూలించడం సాధ్యమవుతుంది. ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల్లో పనుల నిమిత్తం సిబ్బందిపై ఆధారపడకుండా ప్రభుత్వ నిబంధనల ప్రకారం దరఖాస్తు చేసుకుంటే లంచాలు ఇవ్వకుండా అధికారులను ప్రశ్నించి పనులు చేయించుకునే అవకాశం ఉంటుంది.

లంచం అడిగితే ఫిర్యాదు ఇలా

ప్రభుత్వ ఉద్యోగులు వివిధ పనుల నిమిత్తం వచ్చే ప్రజల నుంచి లంచాలు అడిగితే జిల్లాలోని అవినీతి నిరోధక శాఖాధికారులకు ఫిర్యాదు చేయాలి. సదరు ఉద్యోగులపై ఏ విషయంలో ఫిర్యాదు చేసేది లిఖిత పూర్వకంగా నల్లగొండ జిల్లా కేంద్రంలోని ఏసీబీ కార్యాలయానికి వెళ్లి ఫిర్యాదు చేయాల్సి ఉంటుంది. అంతేగాక అక్రమ మార్గంలో ఆదాయానికి మించి ఆస్తులు కూడబెట్టిన ఉద్యోగుల వివరాలను ఫోన్ ద్వారా ఏసీబీకి తెలియజేస్తే సరిపోతుంది. సమాచారం ఇచ్చిన వారి పేరును అధికారులు గోప్యంగా ఉంచుతారు.

ఆ శాఖల్లో అవినీతి ఎక్కువ

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు ఈ ఏడాది ఇప్పటి వరకు 10 కేసులు నమోదు చేశారు. రెవెన్యూ విద్యుత్, పంచాయతీరాజ్, రిజిస్ట్రేషన్లు, రవాణాశాఖ, మత్స్యశాఖ, వైద్య ఆరోగ్యశాఖలో పనిచేస్తున్న ఉద్యోగులపై కేసులు నమోదు చేశారు. జిల్లాలో అవినీతి ఎక్కువగా ఉన్న శాఖల్లో మొదటి, రెండు స్థానాల్లో రెవెన్యూ, విద్యుత్, మూడు, నాలుగు స్థానాల్లో పంచాయతీరాజ్, పోలీస్, రిజిస్ట్రేషన్లు, వాణిజ్య పన్నులశాఖలు ఉన్నాయి. కేసులు నమోదు చేసిన అనంతరం ప్రభుత్వం కొన్ని నెలల తర్వాత సదరు ఉద్యోగులకు ఉద్యోగ బాధ్యతలు అప్పగిస్తోంది. కొంతమంది ప్రజాప్రతినిధులను మచ్చిక చేసుకొని పోస్టింగ్ పొందుతున్నారు. కోర్టుల్లో కేసుల విచారణకు సుమారు ఏడాది నుంచి రెండేళ్ల కాలం పడుతోంది. ఈ కేసుల్లో కొంత మందికి మాత్రమే శిక్షపడుతోంది. ఉమ్మడి జిల్లాలో అవినీతి నిరోధక శాఖాధికారులు నమోదు చేసిన సుమారు 50కేసులు విచారణలో పెండింగ్‌లో ఉన్నాయి. మరికొన్ని కేసులు కోర్టుల్లో నిలబడ లేదు. ఇటీవల ప్రభుత్వం అవినీతి కేసులను త్వరగా విచారించాలని ఆదేశాలు జారీ చేసింది.

లంచం అడిగితే ఫిర్యాదు చేయాలి



అవినీతిని నిర్మూలించేందుకు ప్రజలు మా శాఖకు సహకరించాలి. అవినీతి నిర్మూలన కోసం కళాజాతల ద్వారా ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. అయినా ప్రభుత్వ కార్యాలయాల్లో అవినీతి తగ్గడం లేదు. అవినీతి నిర్మూలన తమ బాధ్యతగా ప్రతీ ఒక్కరు గుర్తించినప్పుడే ఇది సాధ్యమవుతుంది. జిల్లాలో రెవెన్యూ, విద్యుత్,పోలీస్, రవాణా శాఖల్లోని కొంత మంది ఉద్యోగులు ఎక్కువగా అవినీతికి పాల్పడుతున్నట్లు ఫిర్యాదులు వస్తున్నాయి. వారిపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నాం. గతంలో నమోదు చేసిన కేసులకు సంబంధించిన కొంత మంది ఉద్యోగులకు ఇటీవల కోర్టుల్లో శిక్ష కూడా పడింది. ప్రజలు అవినీతి ఉద్యోగులపై టోల్‌ఫ్రీ నెంబరు 1064, సెల్ 9154388918లకు ఫిర్యాదు చేయాలి.

- జగదీష్ చందర్, ఏసీబీ డీఎస్పీ

రెండేళ్లలో ఇలా..

» **ఉమ్మడి జిల్లా పరిధిలో 2023లో ముగ్గురు అధికారులు ఏసీబీకి చిక్కారు.**

» నల్లగొండ జిల్లా డిండి మండలానికి పంచాయతీ కార్యదర్శి శ్రవణ్‌కుమార్ ఓ ఇంటి అనుమతి కోసం శంకరయ్య అనే వ్యక్తి నుంచి రూ.10వేల నగదును తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

» నార్కట్‌పల్లి మండలం అక్కెనపల్లి గ్రామానికి చెందిన కాంట్రాక్టర్ నర్సిరెడ్డి తన బిల్లుల కోసం డీఈ శంకరయ్య, సబ్ ఇంజనీర్, ఇన్‌చార్జి ఏఈ వెంకటిరెడ్డిని ఆశ్రయించగా వారు రూ.10వేలు లంచం డిమాండ్ చేశారు.నర్సిరెడ్డి సదరు రూ.10వేలను డీఈ, ఏఈకి ఇవ్వగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు.

» యాదాద్రి జిల్లా ఆలేరుకు చెందిన శ్రీశైలం వర్క్ బిల్లు కోసం పంచాయతీరాజ్ అధికారి కోదాటి రమేష్‌కు రూ.80 వేలు లంచం ఇస్తుండగా, ఏసీబీకి చిక్కారు.

» **ఈ ఏడాది ఏడు నెలల కాలంలో ఉమ్మడి జిల్లాలో 10 మంది ఉద్యోగులు ఏసీబీకిపట్టుబడ్డారు.**

» యాదాద్రి జిల్లా బొల్లేపల్లికి చెందిన సురేష్ నేషనల్ పర్మిట్ క్యాన్సిలేషన్ కోసం డీటీవో వై.సుధాకర్‌రెడ్డికి రూ.5వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు.

» నల్లగొండ జిల్లా నకిరేకల్‌కు చెందిన ఓ రైతు భూమార్పిడి కోసం నకిరేకల్ రెవెన్యూ ఆర్ఐ వెంకన్న లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు అరెస్టు చేశారు.

» కొండమల్లేపల్లికి చెందిన లచ్చూ అనే రైతు ధరణిలో భూమినికి చేర్చేందుకు రెవెన్యూ ఆర్ఐ శ్రీనివాస్‌రెడ్డికి రూ.40వేలు లంచం ఇస్తుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

» నల్లగొండ ప్రభుత్వ ఆస్పత్రి మెడికల్ కాంట్రాక్టర్ వెంకన్న కాంట్రాక్ట్ రెన్యూవల్ కోసం ఆస్పత్రి సూపరింటెండెంట్ లచ్చూనాయక్ రూ.3లక్షలు లంచం తీసుకుంటుండగా ఏసీబీకి చిక్కారు.

» సూర్యాపేట జిల్లాకు హుజూర్‌నగర్ పంచాయతీరాజ్ అసిస్టెంట్ ఇంజినీర్ రాజా రంగారావు ఓ సర్పంచ్ బిల్లుల విషయంలో రూ.5వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి చిక్కారు.

» యాదాద్రి జిల్లా మోత్కూరుకు చెందిన మహేష్ ఇంటి ఎన్‌వోసీ కోసం పొడిచేడు పంచాయతీ కార్యదర్శి కిరణ్‌కుమార్ రూ.30వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు.

» నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని మల్లారెడ్డిపల్లిలో ఓ విద్యుత్ లైన్‌మెన్ ఏసీబీకి చిక్కారు.

» మిర్యాలగూడకు చెందిన సైదిరెడ్డి ఫార్మసీ సర్టిఫికెట్ కోసం మిర్యాలగూడ ఇన్‌చార్జి డ్రగ్‌ఇన్‌స్పెక్టర్ సోమేశ్వరరావుకు రూ.80వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు.

» సూర్యాపేటకు చెందిన మేక వెంకన్న వెంచర్‌లో ఉన్న రెండు ప్లాట్ల రిజిస్ట్రేషన్ కోసం సూర్యాపేట సబ్ రిజిస్ట్రార్ సురేందర్‌నాయక్ రూ.1లక్ష తీసుకుంటుండగా ఏసీబీకి పట్టుబడ్డారు.

» తాజాగా, శుక్రవారం సూర్యాపేట మత్స్యశాఖ అధికారి రూప్‌సింగ్ రాయినిగూడెం సొసైటీ పని విషయంలో రూ.25వేలు సొసైటీ ప్రతినిధి కోటయ్య నుంచి లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులకు చిక్కారు.

టెండర్లలో గోల్‌మాల్

కేజీబీవీ, ఆదర్శపాఠశాల సరుకుల టెండర్లు నిబంధనలకు విరుద్ధంగా ఖరారు!

ఇష్టారాజ్యంగా వ్యవహరించిన కమిటీ




నల్లగొండ, జూలై 19: జిల్లాలోని కస్తూర్బా బాలికల విద్యాలయాలు(కేజీబీవీ), ఆదర్శ పాఠశాలలు, అర్బన్ రెసిడెన్షియల్ స్కూల్(యుఆర్ఎస్)కు ఈ విద్యా సంవత్సరానికి సంబంధించిన వివిధ సరుకుల సరఫరా కోసం నిర్వహించిన టెండర్లలో గోల్‌మాల్ జరిగినట్టు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. టెండర్లను ఈనెల 18న తెరిచి ప్రభుత్వ ఖజానాకు గండిపడేలా అధికారులు నిర్ణయాలు తీసుకున్నారనే విమర్శలు ఉన్నాయి. జిల్లాలోని 27కేజీబీవీలకు, 17 ఆదర్శ పాఠశాలలకు, ఒక అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలకు 2024-25 విద్యా సంవత్సరానికి సంబంధించి కిరాణ, పాలు, గుడ్లు, పండ్లు, కూరగాయలు, చికెన్, మాంసం సరఫరాకు టెండర్లను పిలిచారు. ఈనెల 6 నుంచి 11వ తేదీ వరకు టెండర్ల దాఖలుకు గడువు. ఈనెల 12న టెండర్లను తెరవాల్సి ఉండగా, కొన్ని కారణాలతో 18కి వాయిదా వేశారు. కిరాణ, కూరగాయలు, పండ్లు, చికెన్, మటన్, పాల సరఫరాకు టెండర్లు ఖరారు అయినా, గుడ్లకు మాత్రం ఖరారు చేయలేదు. గుడ్డును రూ.5 సరఫరా చేయాలని అధికారులు కోరగా, టెండర్‌దారులు రూ.10 చెప్పడంతో దాన్ని నిలిపివేశారు.

నిబంధనల్లో గందరగోళం

సరుకుల సరఫరాకు సంబంధించి విధించిన నిబంధనలు గందరగోళంగా ఉన్నాయి. ఇతర జిల్లాల్లో లేని నిబంధనలను ఇక్కడ విధించారని కాంట్రాక్టర్లు చెబుతున్నారు. రూ.2కోట్ల పనులకు రూ.10కోట్ల టర్నోవర్ చూపించాలని అడగడం ఏంటని ప్రశ్నిస్తున్నారు. ఒక్కరు ఇద్దరూ కాంట్రాక్టర్లకు ప్రయోజనం చేకూర్చేలా నిబంధనలు విధించినట్లు ఆరోపిస్తున్నారు. టెండర్ల ఖరారు సమయంలో జిల్లా స్థాయి కొనుగోలు కమిటీ ఏ మాత్రం నిబంధనలు పట్టించుకోలేదని విమర్శిస్తున్నారు. కాంట్రాక్టర్లు కొందరు సిండికేట్‌గా మారి లక్షల రూపాయలు చేతులు మారిన అనంతరమే టెండర్ ఖరారు అయ్యేలా అధికారులు వ్యవహరించినట్టు ఆరోపణలు వినిపిస్తున్నాయి. టెండర్లలో గోల్‌మాల్‌కు అధికారులు వ్యవహరించిన తీరే కారణమని, ప్రభుత్వ ఖజానాకు గండికొట్టేలా వ్యవహరించిన అధికారులపై చర్యలు తీసుకోవాలని పలువురు డిమాండ్ చేస్తున్నారు.

టెండర్లలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదు



కేజీబీవీ, ఆదర్శ పాఠశాలలు, యుఆర్ఎస్ పాఠశాలలకు సరుకుల సరఫరా విషయంలో నిర్వహించిన టెండర్లలో ఎలాంటి అక్రమాలు చోటు చేసుకోలేదు. పారదర్శకంగా, జవాబుదారీతనంగా టెండర్లను నియమ నిబంధనల మేరకు నిర్వహించాం. గుడ్ల సరఫరాకు సంబంధించిన టెండర్ మాత్రం ఖరారు కాలేదు. మేం రూ.5కు సరఫరా చేయాలని కోరగా, టెండర్ దారులు రూ.10కి సరఫరా చేస్తామనడంతో దీన్ని తిరస్కరించాం. పూర్తి నిబంధనల మేరకే టెండర్లు ఖరారయ్యాయి.

- బొల్లారం భిక్షపతి, నల్లగొండ డీఈవో

విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

కలెక్టర్ నారాయణరెడ్డి



హాలియా జడ్పీ ఉన్నతపాఠశాలలో మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ నారాయణరెడ్డి

హాలియా, జూలై 19: విద్య, వైద్యంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. శుక్రవారం హాలియా ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన తనిఖీ చేశారు. ముందస్తు అనుమతి లేకుండా విధులకు గైర్హాజరైన ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సీనియర్ అసిస్టెంట్ ఎస్.సురేందర్‌ను సస్పెండ్ చేశారు. అనంతరం ఆరోగ్య కేంద్రంలోని హాజరు రిజిస్టర్, ఇతర రిజిస్టర్లు, వార్డు, ల్యాబ్‌ను పరిశీలించి వైద్యాధికారులు, ఉప ఆరోగ్య కేంద్రాల ఇన్‌చార్జ్‌లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైనందున గ్రామాల్లో సీజన్ వ్యాధులు వచ్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని, వీటిపై ప్రత్యేక దృష్టి కేంద్రీకరించాలన్నారు. పారిశుధ్యం, తాగునీటి పై ప్రజలకు అవగాహన కల్పించి, ఎవరైన సీజనల్ వ్యాధులకు గురైతే తక్షణమే వైద్య సేవలందించాలని ఆదేశించారు. గ్రామ స్థాయిలో ఆశ, ఏఎన్ఎమ్‌లు సరిగా విధులు నిర్వహించాలని, పారిశుధ్యం, తాగునీటి పరిస్థితులను గమనించాలన్నారు. అంగన్‌వాడీల ద్వారా గర్భిణులు, బాలింతలు, పిల్లలకు అందిస్తున్న పౌష్టికాహారం, ఐరన్ మాత్రలను పరిశీలించాలన్నారు. అనంతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీచేసి 6, 10వ తరగతి విద్యార్థులతో తెలుగు, ఇంగ్లీష్, ఫిజిక్స్ పాఠ్యాంశాలను చదివించి వారికి ప్రశ్నలు వేసి సమాధానాలను రాబట్టారు. రెండు జతల యూనిఫాం, పాఠ్య పుస్తకాలు వచ్చాయా అని ఆరా తీశారు. మధ్యాహ్న భోజన పథకం షెడ్డును, భోజనాన్ని తనిఖీ చేసి షెడ్‌ను తాగునీటి కుళాయి వద్దకు మార్చాలని, కొత్త కిచెన్ షెడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు పంపించాలని ఆదేశించారు. ఆయన వెంట పీహెచ్‌సీ వైద్యుడు డాక్టర్ రామకృష్ణ, ఉన్నత పాఠశాల ఇన్‌చార్జ్ ప్రధానోపాధ్యాయుడు శైలజ, ఎంపీడీవో సుజాత, ఆర్ఐ శంకర్, పీడీ వెంకట్‌రాంరెడ్డి, తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి : కలెక్టర్

నల్లగొండ టౌన్: జిల్లాలో వైటీపీఎస్, ప్రభుత్వ వైద్య కళాశాల నిర్మాణం, మునిసిపాలిటీలు, గ్రామ పంచాయతీల్లో ఎస్‌జీఎఫ్ నిధులతో మంజూరైన పనులు, ఇతర పథకాల పనులను త్వరితగతిన పూర్తిచేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ, అభివృద్ధి పనుల పూర్తికి అవసరమయ్యే ఇసుకను వంగమర్తి, గొట్టుముక్కల టీజీఎండీసీ రీచ్‌ల నుంచి సేకరించాలని సూచించారు.

ఇసుక రవాణాచేసే ప్రతీ వాహనానికి జీపీఎస్ ట్రాకింగ్ సిస్టం ఏర్పాటు చేయాలన్నారు. కలెక్టరేట్‌లో ఇసుక వాహనాలను పర్యవేక్షించేందుకు కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్దేశించిన పనులకు కాకుండా ఇతర పనులకు ఇసుకను తరలిస్తే వాహనాలపై క్రిమినల్ కేసు నమోదు చేయాలన్నారు.

సాగర్ ఎడమ కాల్వకు నీటి విడుదల

నాలుగు రోజుల పాటు 4వేల క్యూసెక్కులు

తాగునీటి అవసరాలు.. పాలేరు జలాశయం నింపేందుకు

నాగార్జునసాగర్, జూలై 19: నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో ఎడమ కాల్వకు శుక్రవారం నీటిని విడుదల చేశారు. కేఆర్ఎంబీ (కృష్ణా నదీ యాజమాన్య బోర్డు) త్రిసభ్య కమిటీ ఆదేశాల మేరకు తెలంగాణకు కేటాయించిన 5.5 టీఎంసీల నీటి వాటాలో భాగంగా ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్, జేఈ కృష్ణయ్య పొట్టిచెల్మ వద్ద ఉన్న ఎడమ కాల్వ హెడ్ రెగ్యులేటర్ వద్ద స్విచ్ఛాన్ చేసి నీటి విడుదలను ప్రారంభించారు. ఎడమ కాల్వ ద్వారా రోజుకు నాలుగు వేల క్యూసెక్కుల చొప్పున నాలుగు రోజుల్లో మొత్తం 1.5టీఎంసీల నీటిని విడుదల చేయనున్నారు. ఈ నీటితో ఖమ్మం జిల్లాలో ఉన్న పాలేరు జలాశయం నింపి, ఆ జలాశయం పరిధిలోని గ్రామాల్లో తాగునీటి అవసరాలకు వాడనున్నట్లు ప్రాజెక్టు అధికారులు తెలిపారు.

సాగర్ నీటి మట్టం 505అడుగులు

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి మట్టం 590 అడుగులు(312.5050టీఎంసీలు) కాగా శుక్రవారం సాయంత్రానికి 505.00 అడుగులుగా(123.3370టీఎంసీలు) నమోదైంది. సాగర్ నుంచి జంట నగరాల తాగు నీటి అవసరాల కోసం ఎస్ఎల్‌బీసీ ద్వారా 800క్యూసెక్కులు, కుడి కాల్వ ద్వారా 5,700 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 2,712 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. సాగర్ నుంచి మొత్తం 9,212 క్యూసెక్కుల నీరు విడుదలవుతోంది. ఎగువ నుంచి సాయంత్రం ఆరు గంటల సమయానికి సాగర్‌కు ఎటువంటి నీటి రాక లేదు. సాగర్ నుంచి వరద కాల్వలకు, ప్రధాన జల విద్యుత్ కేంద్రానికి ఎటువంటి నీటి విడుదల లేదు.



సాగర్ ఎడమ కాల్వకు నీటిని విడుదల చేస్తున్న ప్రాజెక్టు డీఈ శ్రీనివాస్

మట్టపల్లి క్షేత్రంలో పాండిచ్చేరి హోంమంత్రి పూజలు

మఠంపల్లి, జూలై 19:సూర్యాపేట జిల్లా మట్టపల్లి క్షేత్రంలో శ్రీలక్ష్మీనృసింహస్వామిని పాండి చ్చేరి రాష్ట్ర హోంమంత్రి ఏ నమశివాయమ్ దంపతులు దర్శించుకున్నారు. ఉదయం తొమ్మిది గంటలకు ఆలయ ధర్మకర్తలు హోంమంత్రికి పూర్ణకుంభంతో స్వాగతం పలికి స్వామి సన్నిధిలో ప్రత్యేక పూజల అనంతరం ఆలయ ధర్మకర్తలు చెన్నూరి మట్టపల్లిరావు, విజయ్‌కుమార్‌లు పట్టువస్త్రాలతో ఘనంగా సత్కరించారు. వేదపండితులు ఆలయ విశిష్టతను వివరించి ఆశీర్వచనాలు, స్వామి వారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆయన వెంట తహసీల్దార్ మంగా రాథోడ్, హుజూర్‌నగర్ సీఐ చరమందరాజు, ఎస్‌ఐ రామాంజనేయులు ఉన్నారు.


పాండిచ్చేరి హోంమంత్రి దంపతులతో ధర్మకర్తలు, పూజారులు

వైభవంగా ఆండాళ్ అమ్మవారికి ఊంజల్ సేవ

భువనగిరి అర్బన్, జూలై 19 : యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనృసింహస్వామి సన్నిధిలో శుక్రవారం స్వామివారికి స్వర్ణపుష్పార్చన, అమ్మవారికి ఊంజల్ సేవోత్సవం వైభవంగా నిర్వహించారు. వేకువజామున సుప్రభాత సేవతో స్వయంభువులను మేల్కొలిపి పంచామృతాలు, వేదమంత్ర పఠనాలతో అభిషేకం, తులసీదళాలు, కుంకుమతో అర్చించారు. ప్రాకారమండపంలో హోమం, నిత్యకల్యాణం సంప్రదాయరీతిలో కొనసాగాయి. సాయంత్రం ఆండాళ్ అమ్మవారికి పట్టువస్త్రాలు, ముత్యాలు, బంగారు ఆభరణాలతో దివ్యమనోహరంగా అలంకరించి సేవలో తీర్చిదిద్దారు. అమ్మవారి సేవను ఆలయ తిరువీధుల్లో ఊరేగించిన అనంతరం అద్దాల మండపం ఊయల్లో అధిష్ఠింపజేసి, ఊంజల్ సేవోత్సవం నేత్రపర్వంగా జరిపించారు. పాతగుట్ట ఆలయంలో నిత్య పూజలు సాంప్రదాయ రీతిలో కొనసాగాయి. అనుబంధ శివాలయంలో పర్వతవర్ధిని శ్రీ రామలింగేశ్వర స్వామి వారికి నిత్య పూజలు, యాగశాలలో చండీహోమం చేపట్టారు. ఆలయ ఖజానాకు వివిధ విభాగాల నుంచి రూ. 11,36,167 ఆదాయం సమకూరినట్లు ఆలయ ఈవో భాస్కర్‌రావు తెలిపారు. కాగా, రమ్య మ్యూజిక్ అకాడమీ, భక్తి సంగీతం, నటరాజ నిలయం వారిచే కూచిపూడి నృత్యం ప్రదర్శన జరిగింది.


అద్దాల మండపంలో ఊంజల్ సేవోత్సవం నిర్వహిస్తున్న పూజారులు

ఉమ్మడి నల్లగొండలో మోస్తరు వర్షం

మూడు రోజులుగా కురుస్తున్న జల్లులు

యాదాద్రి, జూలై 19 (ఆంధ్రజ్యోతి) / నల్లగొండ / సూర్యాపేట టౌన్ : ఉమ్మడి నల్లగొండ జిల్లాలో శుక్రవారం మోస్తరు వర్షం కురిసింది. తుపాను ప్రభావంతో మూడు రోజులుగా ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ముసురుతో కూడిన వర్షపు జల్లులు కురుస్తూనే ఉన్నాయి. నల్లగొండ జిల్లాలో సగటున 13.0 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది. అత్యధికంగా కేతేపల్లిలో 4.1 సెంటీమీటర్లు, అత్యల్పంగా కట్టంగూరులో 2.4సెంటీమీటర్ల వర్షం కురిసింది. యాదాద్రిభువనగిరి జిల్లాలో సగటున 16.0మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా రామన్నపేట మండలంలో 3.4 సెంటీమీటర్లు, అత్యల్పంగా సంస్థాన్‌నారాయణపురంలో 5.7మిల్లీమీటర్ల వర్షం కురిసింది. సూర్యాపేట జిల్లాలో సగటున 12.8 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదుకాగా, అత్యధికంగా మేళ్ళచెర్వు మండలంలో 25.2 మిల్లీమీటర్లు, అత్యల్పంగా నేరేడుచర్లలో 4.2 మిల్లీమీటర్ల వర్షం కురిసింది.

రామాజీపేటలో ఆరు గొర్రెలు అపహరణ

యాదగిరిగుట్ట రూరల్, జూలై 19: యాదాద్రిభువనగిరి జిల్లా యాదగిరిగుట్ట మండలం రామాజీపేట గ్రామానికి చెందిన గుర్రం అంజనేయులుకు చెందిన గొర్రెలను గురువారం రాత్రి ఇంటి వద్దనుంచి దుండగులు అపహరించారు. వాటి విలువ సుమారు 75 వేల రూపాయాలు ఉంటుందని బాధితుడు తెలిపారు.

పాఠశాల బస్సుకు తప్పిన ప్రమాదం

వలిగొండ, జూలై 19: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ మండలం దుప్పల్లి గ్రామ సమీపంలో పాఠశాల బస్సు స్టీరింగ్ విరిగి రోడ్డు పక్కకు దూసుకెళ్లింది. స్థానికుల సమాచారం మేరకు వివరాలిలా ఉన్నాయి. మోత్కూరులోని సెయింట్ ఆన్స్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలకు చెందిన బస్సు విద్యార్థులను తీసుకురావడానికి శుక్రవారం ఉదయం బయలుదేరింది. రాఘవాపురం, కూరెళ్ల, దుప్పల్లి గ్రామాలకు చెందిన 20మంది విద్యార్థులను బస్సులో ఎక్కించుకుని పాఠశాలకు వస్తుండగా వలిగొండ మండలం దుప్పల్లి గ్రామం దాటాక ప్రమాదవశాత్తు బస్సు స్టీరింగ్ రాడ్ విరిగింది. డ్రైవర్ చాకచక్యంతో బస్సును రోడ్డుకు పక్కకు తప్పించాడు. భూమి చిత్తడిగా ఉండడంతో బస్సు ఆగిపోయింది. పిల్లలను బస్సు నుంచి కిందికి దించి, విద్యార్థులను తిరిగి ఇళ్లకు పంపించారు. ఈ ఘటనలో బస్సులో ఉన్న 20మంది విద్యార్థులకు ఎలాంటి గాయాలు కాకపోడంతో తల్లిదండ్రులు ఊపిరిపీల్చుకున్నారు.


దుప్పల్లిలో రహదారి పక్కకు దూసుకెళ్లిన పాఠశాల బస్సు

ఫొటో ఎగ్జిబిషన్‌ను విజయవతం చేయాలి

చౌటుప్పల్ టౌన్, జూలై 19: హైదరాబాద్ లో మూడు రోజుల పాటు నిర్వహించే ఫొటో ఎగ్జిబిషన్‌ను విజయవంతం చేయాలని యాదాద్రిభువనగిరి జిల్లా చౌటుప్పల్ మునిసిపల్ చైర్మన్ వెన్‌రెడ్డి రాజు కోరారు. హైదరాబాద్‌లో ఈ నెల 26 ,27, 28 తేదీల్లో నిర్వహించే ఫొటో ట్రేడ్ ఎక్స్‌పో వాల్‌పోస్టర్లను శుక్రవారం ఆయన ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఫొటో అండ్ వీడియోగ్రాఫర్స్ అసోసియేషన్ ప్రతినిధులు రవీందర్, సాయిలు, మెట్టు రామచంద్రారెడ్డి, చంద్రశేఖర్, కృష్ణ, గణేష్, ఊడుగు రమేష్, నవీన్,కాటంరాజు, రాజు, స్వామి ,రుషి, రాఘవేంద్ర, మధు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంలో మూడు గేదెలు మృతి

భువనగిరి టౌన్, జూలై 19 : యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని బహార్‌పేటకు చెందిన కట్ల యాదగిరి మూడు గేదెలు విద్యుదాఘాతంతో శుక్రవారం మృతి చెందాయి. హౌసింగ్‌బోర్డు కాలనీ సమీపంలో గడ్డిమేస్తున్న గేదెలు అప్పటికే తెగిపడి ఉన్న విద్యుత్‌వైరుకు తాకి విద్యుదాఘాతానికి గురై వెంటనే మృతి చెందాయి. రూ.3 లక్షల విలువైన పాడి గేదెలను కోల్పోయిన యాదగిరిని ప్రభుత్వం ఆదుకోవాలని సహచర రైతులు కోరారు.

ఇరువురిపై కేసు నమోదు

గుండాల, జూలై 19 : యాదాద్రిభువనగిరి జిల్లా గుండాల మండలం వస్తాకొండూరులో ఒకరిపై ఒకరు దాడి ఘటనలో ఇరువురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సైదులు తెలిపారు. వస్తాకొండూరుకు చెందిన శెట్టిపల్లి చంద్రయ్య పీర్ల పండుగ సందర్భంగా సురారపు ఎల్లమ్మతో డబ్బు విషయంలో శుక్రవారం గొడవ జరిగింది. ఆ సయమంలో అటుగా వెళ్తున్న గ్రామానికి చెందిన తాపీ మేస్త్రీ సూరారపు సురేశ్ అలియాస్ సుధాకర్ గొడవ ఎందుకు వారించాడు. దీంతో చంద్రయ్య కోపంతో గొడ్డలిపై సురేశ్‌పై దాడి చేసి గాయపరిచాడు. దీంతో సురేశ్ అక్కడే మహిళ వద్ద ఉన్న కర్ర తీసుకుని చంద్రయ్య తలపై దాడి చేయగా తీవ్రంగా గాయపడ్డాడు. దీంతో ఇరువురు పోలీస్‌స్టేషన్‌లో ఒకరిపై ఒకరు ఫిర్యాదు చేయగా ఇరువురిపై కేసు నమోదు చేసి చికిత్స నిమిత్తం ఆలేరు ఏరియా ఆసుపత్రికి పంపించారు.

మెసేజ్‌లు, ఏపీకే ఫైల్ వస్తే ఓపెన్ చేయొద్దు

నల్లగొండ క్రైం, జూలై 19 : రైతు రుణమాఫీ పేరుతో వచ్చే మెసేజ్‌లు, ఆండ్రాయిడ్ అప్లికేషన్ ప్యాకేజ్(ఏపీకే) ఫైల్స్‌ను ఓపెన్ చేయవద్దని నల్లగొండ జిల్లా ఎస్పీ శరత్‌చంద్ర పవార్ శుక్రవారం ఒక ప్రకటనలో సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా రైతు రుణమాఫీ చేసిన నేపథ్యంలో కొంతమంది సైబర్ నేరగాళ్లు ఇదే అదునుగా రైతులను మోసం చేసేందుకు చూస్తారని ఆయన పేర్కొన్నారు. వివిధ బ్యాంకుల లోగోలు, వాట్సాప్ ప్రొఫైల్ పిక్స్ పెట్టి రైతు రుణమాఫీ అంటూ ఏపీకే ఫైల్ వంటి లింకులు పంపుతున్నారన్నారు. రుణమాఫీ అంటూ ఫోన్‌కాల్ చేసి ఓటీపీలు అడిగి రైతుల ఖాతాల్లోని ఉన్న డబ్బులను ఖాళీ చేస్తున్నారని, అలాంటి వాటిని నమ్మి రైతులు మోసపోవద్దన్నారు. వ్యక్తిగత సమాచారాన్ని అనుమానితులకు తెలపవద్దని, ఎలాంటి సమాచారమైన బ్యాంకు అధికారులను నేరుగా సంప్రదించి తెలుసుకోవాలన్నారు. ఎవరైనా సైబర్ నేరాలకు గురైతే వెంటనే హెల్ప్ లైన్ నెంబర్ 1930కి డయల్ చేయాలన్నారు. అదేవిధంగా www.cybercrime.gov.inలో రిపోర్టు చేయడంతో పాటు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

స్నేహితుడికి సాయంగా వెళ్లి మృత్యువాత

● బురద పొలంలో ట్రాక్టర్ పల్టీ ● బురదలో చిక్కుకుని రైతు మృతి


బురద పొలంలో పల్టీ కొట్టిన ట్రాక్టర్, మృతిచెందిన మంటిపల్లి నర్సింహ(ఫైల్ ఫొటో)

నార్కట్‌పల్లి, జూలై 19: స్నేహితుడికి పొలం పనుల్లో సాయం చేసేందుకు వెళ్లి బురద పొలం దున్నుతుండగా ట్రాక్టర్ పల్టీకొట్టడంతో దానికింద పడి ఓ రైతు ప్రాణం వదిలాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా నార్కట్‌పల్లి మండలం పల్లెపహాడ్‌లో ఈ సంఘటన జరిగింది. ఎస్ఐ అంతిరెడ్డి, స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పల్లెపహాడ్ గ్రామానికి చెందిన మంటిపల్లి నర్సింహ(54)కు రెండు ఎకరాల పొలం ఉంది. వ్యవసాయంతో పాటు లారీ డ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. అదే గ్రామానికి చెందిన స్నేహితుడు నర్సిరెడ్డికి చేదోడుగా అతడికి చెందిన పొలాన్ని దున్నేందుకు శుక్రవారం వెళ్లాడు. బురదగా ఉన్న పొలాన్ని దున్నుతుండగా ఇంజను వెనుక నాగళ్లు బురదలో ఇరుక్కుని ట్రాక్టర్ ముందుకు కదల్లేదు. దీంతో నాగళ్లను తొలగించి దున్నుతుండగా అదుపుతప్పి ట్రాక్టర్ ఇంజన్ ఒక్కసారిగా పల్టీకొట్టింది. దీంతో ట్రాక్టర్ నడుపుతున్న నర్సింహ బురద పొలంలో కూరుకుపోయాడు. పక్కనే ఉన్న నర్సిరెడ్డి వెంటనే పరిసరాల్లో ఉన్న రైతులను పిలిచి బయటకు తీసి, గట్టుపై కూర్చోబెట్టేలోగా నర్సింహ మృతిచెందాడు. నర్సింహకు భార్య యాదమ్మ, కుమారుడు, కుమార్తె ఉన్నారు. యాదమ్మ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అంతిరెడ్డి తెలిపారు.

కూల్‌డ్రింక్ ఇచ్చి.. పుస్తెలతాడు చోరీ


దుండగుడి దాడిలో గాయపడిన గన్నెబోయిన ముత్యాలమ్మ

పెద్దఅడిశర్లపల్లి, జూలై 19: తెలిసిన వాడిలా మాటలు కలిపి, కూల్‌డ్రింక్ ఇచ్చి తాగేలోపు మహిళపై రాయితో దాడి చేసి పుస్తెలతాడును చోరీ చేశాడు. శుక్రవారం నల్లగొండ జిల్లా పెద్దఅడిశర్లపల్లి మండలంలో ఈ సంఘటన జరిగింది. గుడిపల్లి ఎస్ఐ నర్సింహులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మండలంలోని మల్లాపురం గ్రామానికి చెందిన గన్నెబోయిన ముత్యాలమ్మ వద్దిపట్ల-అజ్మాపురం రహదారి పక్కనే మల్లాపురం గ్రామశివారులోని సొంత పొలంలో చెత్తా చెదారం తీసే పనుల్లో ఉండగా అక్కడికి బైక్‌పై వచ్చిన యువకుడు ఆమెతో మాటలు కలిపి తెలిసిన వాడిలా మాట్లాడుతూ కూల్‌డ్రింగ్ తాగమని ఇచ్చాడు. ఆమె తాగే క్రమంలో పక్కనే ఉన్న రాయితో తలపై దాడి చేసి మెడలో ఉన్న రూ.2.10లక్షల విలువైన మూడు తులాల పుస్తెలతాడు లాగేసుకుని బైక్‌పై పారిపోయాడు. దాడి నుంచి ఆమె తేరుకుని చూసే సరికి అక్కడి నుంచి ఎటో వెళ్లిపోయాడు. ఘటనపై బాధితురాలి ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ నర్సింహులు తెలిపారు.

దుర్భాషలాడారని యువకుడి ఆత్మహత్య


భిక్షపతినాయక్(ఫైల్)

బొమ్మలరామారం, జూలై 19 : కంపెనీలో తోటి సిబ్బంది దుర్భాషలాడారని యువకుడు బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా బొమ్మలరామారం మండలం మైలారంకిందితండాలో శుక్రవారం జరిగింది. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ధీరావత్ మంగ్యా, వాల్కి దంపతులకు ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ధీరావత్ భిక్షపతినాయక్(24) ఉన్నారు. చాలా ఏళ్ల కిందట మంగ్యా చనిపోగా, రెండు నెలల కిందట వాల్కి అనారోగ్యంతో చనిపోయింది. ప్రస్తుతం భిక్షపతినాయక్, అతడి అక్క కలిసి ఉంటున్నారు. రాంపల్లి గ్రామంలోని కార్తికేయ రెడీమిక్స్ కాంక్రీట్(ఆర్ఎంసీ) కంపెనీలో ఎక్స్‌కవేటర్ డ్రైవర్‌గా భిక్షపతినాయక్ పనిచేసేవాడు. నాలుగు రోజులుగా కంపెనీకి వెళ్లడంలేదు. కంపెనీలో సూపర్‌వైజర్‌తో పాటు తోటి సిబ్బంది తనను దుర్భాషలాడారని స్నేహితులకు చెప్పాడు. ఈ విషయమై మనస్తాపంతో ఉన్న ఆయన సాయంత్రం ఇంట్లో అక్క లేని సమయంలో ఉరివేసుకున్నాడు. చుట్టుపక్కల వ్యక్తి కిటికీలోంచి భిక్షపతినాయక్ ఉరివేసుకుంది చూసి స్థానికుల సాయంతో ఇంట్లోకి వెళ్లే సరికి మృతి చెందాడు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ రాఘవేందర్‌గౌడ్ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో మాజీ సర్పంచ్ మృతి


శ్రీనివాస్‌నాయక్(ఫైల్)

బీబీనగర్, జూలై 19 : రైతు రుణమాఫీ సంబురాల్లో పాల్గొని అందరితో సంతోషంగా జరిపిన ఓ గ్రామ తాజా మాజీ సర్పంచ్ అదే రోజు రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ ఘటన యాదాద్రి భువనగిరి జిల్లా బీబీనగర్ మండలకేంద్రంలో శుక్రవారం వెలుగుచూసింది. ఎస్ఐ రమేశ్, కుటుంబసభ్యులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని నీలతండా తాజామాజీ సర్పంచ్ నూనావత్ శ్రీనివాస్‌నాయక్(35)గురువారం మండలంలోని రాయరావుపేట రైతువేదికలో నిర్వహించిన రుణమాఫీ సంబురాలు వీడియోకాన్ఫరెన్స్‌లో ఉత్సాహంగా పాల్గొన్నాడు. అదే రోజు రాత్రి వ్యక్తిగత పనులు ముగించుకుని బైక్‌పై బీబీనగర్ నుంచి స్వగ్రామం నీలతండాకు బయలుదేరాడు. పట్టణ శివారులో పంచముఖి లేఅవుట్‌కు వెళ్లే దారిలో మలుపు వద్ద బైకు అదుపు తప్పి రోడ్డు పక్కన ఉన్న చెట్టుకు వేగంగా ఢీకొట్టి ఎగిరిపడ్డాడు. చీకటి కావడంతో అక్కడ ప్రమాద ఘటనను ఎవరూ గుర్తించలేకపోయారు. తలకు బలమైన గాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. శుక్రవారం తెల్లవారు జామున వాకర్స్ గుర్తించి పోలీసులకు, కుటుంబసభ్యులకు సమాచారం చేరవేశారు. శ్రీనివాస్‌నాయక్‌కు భార్య పద్మ, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పద్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు. శ్రీనివాస్ మృతి పట్ల ఎమ్మెల్యే కుంభం అనిల్ కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఫైళ్ల శేఖర్‌రెడ్డితో పాటు, వివిధ పార్టీల నాయకులు సంతాపం వ్యక్తం చేశారు.

మహిళకు గాయాలు

చిట్యాల, జూలై 19 : నల్లగొండ జిల్లా చిట్యాలలో హైదరాబాద్-విజయవాడ జాతీయ రహదారిపై శుక్రవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ మహిళకు తీవ్రగాయాలయ్యాయి. చిట్యాలకు చెందిన సంగిశెట్టి సుగుణమ్మ జాతీయ రహదారిపై హైస్కూల్ సమీపంలో రోడ్డు దాటుతుండగా హైదరాబాద్ నుంచి విజయవాడ వైపు వెళ్తున్న కారు ఢీకొట్టడంతో సుగుణమ్మ రోడ్డుపై పడింది. వెంటనే అటు వైపే వెళ్తున్న లారీ ఢీకొట్టడంతో తీవ్రంగా గాయపడింది. గాయపడిన సుగుణమ్మను చికిత్స నిమిత్తం నార్కట్‌పల్లి కామినేని ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై ఫిర్యాదు అందలేదని ఎస్ఐ సైదాబాబు తెలిపారు.

దొంగకు కఠిన కారాగార శిక్ష

చింతపల్లి, జూలై 19 : నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలో దొంగతనం కేసులో ఓ వ్యక్తికి దేవరకొండ కోర్టు ప్రిన్సిపల్ జ్యుడిషియల్ ఫస్ట్‌క్లాస్ మెజిస్ట్రేట్ కఠిన కారాగార శిక్ష విధించినట్లు ఎస్ఐ యాదయ్య తెలిపారు. శుక్రవారం ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నల్లగొండ జిల్లా చింతపల్లి మండలంలోని తీదేడు(వెంకటంపేట)కు చెందిన కలగోని భాగ్యమ్మ ఇంట్లో జనవరిలో గడ్డం విష్ణుమూర్తి అనే వ్యక్తి చొరబడి ఇంట్లోని 17 తులాల వెండి పట్టా గొలుసులు ఎత్తుకెళ్లాడు. బాధితురాలి భర్త సత్తయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసును నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు. పూర్తిస్థాయి ఆధారాలతో దేవరకొండ కోర్టుకు అందజేశారు. కోర్టు విచారణలో నేరం నిర్ధారణ కావడంతో నిందితుడికి మెజిస్ట్రేట్ ఏడాది పాటుకఠిన కారాగార శిక్ష విధించారు. దాంతో పాటు రూ.1000 జరిమానా విధించినట్లు ఎస్ఐ తెలిపారు.

కారును తప్పించబోయి లారీ బోల్తా

చింతపల్లి, జూలై 19: నల్లగొండ జిల్లా చింతపల్లి మండలం పోలేపల్లిరాంనగర్ గేట్ సమీపంలో శుక్రవారం రాత్రి ఇటుక లోడ్ లారీ బోల్తా పడింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం మల్లేపల్లి నుంచి వస్తున్న ఇటుక లోడ్ లారీ ఎదురుగా కారును తప్పించే క్రమంలో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్‌కు ఎలాంటి గాయాలు కాలేదు.

ఆధారం.. భారమవుతోంది

» నానాటికీ పెరిగిపోతున్న నూలు ధరలు » భారంగా వస్త్ర విక్రయాలపై జీఎస్టీ
» మార్కెటింగ్‌పై తీవ్ర ప్రభావం » ధరల నియంత్రణ లేక.. ప్రభుత్వాల సహకారం అందక నేతన్నలు విలవిల

ఒడిదుడుకులను ఎదుర్కొని నిలదొక్కుకునే తరుణంలో పెరిగిన నూలు ధరలు చేనేత పరిశ్రమను కోలుకోలేని దెబ్బతీశాయి. ప్రతీ ఏడాది నూలు ధరలు రెట్టింపు కావడం, పెరిగిన ధరలకు అనుగుణంగా చీరల ధరలు పెరగడంతో కొనుగోళ్లపై తీవ్రప్రభావం పడింది. ఫలితంగా వస్త్రాల కొనుగోళ్లు లేక మార్కెట్ డీలాపడిపోయింది. నూల ధరలు నియంత్రణ లేక ఇటు ప్రభుత్వాల సహకారం అందక నేతన్నలు విలవిలలాడుతున్నారు. మరోవైపు కేంద్ర ప్రభుత్వం వస్త్ర విక్రయాలపై విధించే జీఎస్టీ కూడా తీవ్ర ప్రభావం చూపింది.

\- భూదాన్‌పోచంపల్లి


చేనేత రాట్నంపై నూలు వడుకుతున్న చేనేత కార్మికురాలు

చేనేత వస్త్రాలు విక్రయాలు జరగక కొత్త ఆర్డర్లు వచ్చే పరిస్థితి లేకుండాపోయింది. దీనికి తోడు ఇతర రాష్ట్రాల నుంచి వచ్చే దారం దిగుబడి నిలిచిపోయింది. నాలుగు నెలలుగా చేనేత కార్మికులకు పని లేకుండాపోయింది. మాస్టర్ వీవర్స్ బతుకుబండి దారి తప్పుతోంది. కళకళలాడాల్సిన వస్త్ర వ్యాపారాలు దివాళా తీస్తున్నాయి. సిల్క్ యారన్‌పై ఆధారపడ్డ వ్యాపారులదిదిక్కులేని పరిస్థితి. దారాన్ని కిలో రూ.100 లాభంతో మాస్టర్ వీవర్స్‌కు సరఫరా చేస్తుంటారు. సిల్కు యారన్ ధరలు నానాటికీ పెరిగిపోతుండటంతో చేనేతలతో దారంపోగు బంధం విడిపోతోంది. మాస్టర్ వీవర్లు సైతం అతి భారంగా మగ్గాలు నడుపుతున్నారు.

నియంత్రణ లేని నూలు ధరలు

గతంలో చైనా నుంచి 60 శాతం, బెంగుళూరు నుంచి 40శాతం సిల్కు వచ్చేది. కరోనా తర్వాత చైనా నుంచి పూర్తిగా సిల్కు దిగుమతులు నిలిపివేశారు. దీంతో డిమాండ్‌కు తగ్గట్టు ఉత్పత్తి లేకపోవడంతో మార్కెట్‌లో సిల్కు యారన్ ధరలు విపరీతంగా పెరిగాయని వ్యాపారులు పేర్కొంటున్నారు. అయితే ఇబ్బడిముబ్బడిగా పెరుగుతున్న నూలు ధరలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నియంత్రించలేకపోతున్నాయి. అంతేగాక రాష్ట్ర ప్రభుత్వం కార్మికుడికి నూలుపై ఇచ్చే 40శాతం సబ్సిడీ అందడం లేదు. రెండు నెలలకోసారి రావాల్సిన యారన్ సబ్సిడీ ఆరు నెలలు గడిచినా రావడం లేదని కార్మికులు వాపోతున్నారు.

ఆందోళనలో మాస్టర్ వీవర్స్, కార్మికులు!

మాస్టర్ వీవర్స్ ఒక చీర నేసేందుకు కార్మికులకు రూ.2వేల వంతున చెల్లిస్తారు. అదేవిధంగా ఒక చీరకు 800 గ్రాముల దారాన్ని అప్పగిస్తారు. ఒక చీరను నేయడానికి కనీసం 5 రోజులు పడుతుంది. కాగా, ఇందులో అచ్చు అతకడానికి, చిటికి తిప్పడానికి అయ్యే ఖర్చులు పోను కార్మికులకు ఒక్కో చీరకు రూ.1700 గిట్టుబాటు అవుతుంది. ప్రస్తుతం పనులు లేక జేబుల్లో చిల్లిగవ్వలేక వేలాది చేనేత కుటుంబాలు అలమటిస్తున్నాయి. ఉమ్మడి నల్లగొండ జిల్లావ్యాప్తంగా 600మందికి పైగా మాస్టర్ వీవర్స్ ఈ వృత్తిపై ఆధారపడ్డారు. వ్యాపారం అంతా సవ్యంగా జరిగితే గాని చీర ఒక్కంటికి రూ.800 నుంచి రూ.1000 వరకు లాభం సమకూరుతుంది. ఇప్పుడు ఆర్డర్లు లేక మాస్టర్ వీవర్స్ కార్మికులు ఆందోళన చెందుతున్నారు.

నష్టమొస్తున్నా మగ్గాలు నడిపిస్తున్నా



భూదాన్‌పోచంపల్లిలో 40 మగ్గాలు నడిపిస్తున్నా. మగ్గాలపై ఆధారపడి 60 కుటుంబాలు జీవనం సాగిస్తున్నాయి. కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నామే గాని, పెరిగిన నూలు ధరలతో మార్కెట్లో గిరాకీ లేదు. మగ్గాలు బంద్ చేద్దామంటే కూలికి నేసే కార్మికులు రోడ్డున పడతారని నష్టం వచ్చినా నడిపిస్తున్నా. పెట్టుబడి సాయం కింద రూ.25 లక్షలు పావులా వడ్డీకి రుణాలు అందించాలి. ప్రభుత్వం ప్రకటించిన యారన్ సబ్సిడీ 40శాతం నేరుగా కార్మికుడి ఖాతాలో జమచేయాలి. కార్మికులకు పని కల్పించేలా కొత్త ప్రభుత్వం దృష్టి సారించాలి. చేనేతను కాపాడాలని కోరుతున్నాం.

\- శ్రీనివాస్, మాస్టర్ వీవర్, భూదాన్‌పోచంపల్లి

బతుకలేని పరిస్థితి దాపురించింది



కుటుంబ ఆర్థిక పరిస్థితుల వల్ల నా భర్త ఐదేళ్ల కిందట ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రస్తుతం నేను కూలికి మగ్గం నేస్తున్నా. వచ్చే ఆదాయంతో ముగ్గురు ఆడపిల్లలను పోషించుకుంటున్నా. పెరిగిన నిత్యావసర ధరలతో కుటుంబాన్ని పోషించుకోవడం భారంగా మారింది. మాలాంటి నిరుపేదలను ప్రభుత్వం ఆదుకోవాలి. చేనేత మగ్గంపై ఆధారపడిన మాకు ప్రస్తుతం అంతగా పని దొరకడం లేదు. జీవనం భారంగా మారింది.

\-కూరపాటి లావణ్య,చేనేత కార్మికురాలు,భూదాన్‌పోచంపల్లి

ఒక్కో వార్పుపై రూ.15వేలు అదనపు భారం

గతంలో కిలో పడుగు(నిలువు దారం) రూ.3500, పేక(అడ్డం దారం)ధరకిలో రూ.3000 ఉండగా ప్రస్తుతం కిలో పడుగు రూ.4400, పేక ధర రూ.4000కు పెరిగింది. ఏడు చీరలు కలిగిన ఒక వార్పుకు సుమారు ఐదున్నర కిలోల నూలు అవసరం. ఈ లెక్కన సరాసరి నూలు కిలో ఒక్కింటికి రూ.1000 పెరగడం తో ఒక్క వార్పుపై నూలు, రంగులు, రసాయనాలతో కలిపి అదనంగా రూ.15 వేల మేరకు భారం పడుతోంది. అంతేగాక జరీ బుట్టకు రూ.50 పెరిగింది. నూలు, రంగులు, రసాయనాలు, సబ్బులు, బ్లీచింగ్ తదితర వస్తువుల ధరల పెరుగుదలతో ఒక్కో చీరపై రూ. 2500 వరకు ధర పెరిగింది. చీర తయారీ ఖర్చులు పెరిగినా విక్రయాలు లేకపోవడంతో చీరల ధరలు పెంచలేక నష్టపోతున్నారు. అసలే మార్కెట్‌లేక ఇబ్బందుల్లో ఉన్న మాస్టర్ వీవర్స్‌కు ధరల పెరుగుదల అదనపు భారంగా పడింది. దీంతో మాస్టర్ వీవర్స్ పరిస్థితి ఆగమ్యగోచరంగా మారింది.


నూలుకు రంగులు అద్దుతున్న కార్మికుడు

రైతులను ఇబ్బందులకు గురిచేస్తే ఉపేక్షించం

● మహాజన సభలో డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న డీసీసీబీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి

నల్లగొండ, జూలై 19 : జిల్లా సహకార రైతుల సంక్షేమం కోసం తమ పాలకవర్గం, ప్రభుత్వం పెద్దఎత్తున కృషి చేస్తోందని, ఎవరైనా ఉద్యోగులు, అధికారులు రైతులను ఇబ్బందులకు గురి చేస్తే ఎంతటి వారైనా ఉపేక్షించేది లేదని డీసీసీబీ చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. శుక్రవారం నల్లగొండ జిల్లా కేంద్రంలో నిర్వహించిన డీసీసీబీ మహాజన సభలో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని ప్రాథమిక సహకార సంఘాల సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పీఏసీఎస్ చైర్మన్లకు సీఈవోలు, ఉద్యోగులు, అధికారులు సహకరించి సొసైటీల అభివృద్ధి కోసం కృషి చేయాలన్నారు. సహకార బ్యాంకుల్లో రాజకీయాలకు, పైరవీలకు ఎలాంటి తావు లేదని స్పష్టం చేశారు. కొంతమందికి సబ్సిడీ రావడం లేదని వారందరికీ సబ్సిడీ అందేలా కృషి చేయాలన్నారు. రూ.3వేల కోట్ల టర్నోవర్ లక్ష్యంగా తమ పాలకవర్గం పనిచేస్తోందన్నారు. ఇప్పటికే బ్యాంకు రూ.2300కోట్ల టర్నోవర్ కలిగి ఉందని రూ.22.13 కోట్ల లాభాల్లో ముందుకు సాగుతోందన్నారు. కొత్తగా పంట రుణాలుగా రూ.40 కోట్ల వరకు ఇచ్చామని ఇందులో కొత్త సభ్యులు కూడా రుణాలు పొందారన్నారు. ఈ నెల 23వ తేదీన మేనేజర్లతో జరిగే సమావేశంలో రైతుల సంక్షేమం కోసం అనేక నిర్ణయాలు తీసుకుంటామన్నారు. 25వ తేదీన హైదరాబాద్‌లో జరిగే టెస్కాబ్ సమావేశంలో డీసీసీబీ అభివృద్ధిపై చర్చించనున్నట్లు తెలిపారు. కేంద్ర ప్రభుత్వం నుంచి అనేక పథకాలు వస్తున్నందున వాటిని ఉపయోగించుకుంటామని, రూ.2కోట్ల వరకు ఒకొక్కరికి రుణాలు వచ్చే అవకాశాలు ఉన్నాయన్నారు. రుణాలను వేగంగా మంజూరు చేయాలని ఆదేశించామన్నారు. రాష్ట్రంలో రెండో స్థానంలో ఉన్న డీసీసీబీని మొదటి స్థానానికి తీసుకవస్తామన్నారు. అదేవిధంగా పంట రుణాలు రూ.3లక్షలు ఇచ్చేలా ప్రణాళికలు రూపొందిస్తామన్నారు. సమావేశంలో డీసీసీబీ వైస్‌చైర్మన్ ఏసీరెడ్డి దయాకర్‌రెడ్డి, డీసీఎంఎస్ చైర్మన్ బోళ్ల వెంకట్‌రెడ్డి, డైరెక్టర్లు పాశం సంపత్‌రెడ్డి, గుడిపాటి సైదులు, కొండ సైదయ్య, సీఈవో శంకర్‌రావు పాల్గొన్నారు. సమావేశం అనంతరం నూతన చైర్మన్ కుంభం శ్రీనివాస్‌రెడ్డిని ఉమ్మడి జిల్లాకు చెందిన పీఏసీఎస్ చైర్మన్లు శాలువాలు, పుష్పగుచ్ఛాలు, జ్ఞాపికలతో ఘనంగా సన్మానించారు.

పిల్లలమర్రి శివాలయంలో అఘోరాలు

● కాశీ నుంచి రామేశ్వరం వెళుతూ మార్గమధ్యలో పూజలు


పూజల్లో పాల్గొన్న కాశీ ప్రాంతానికి చెందిన అఘోరాలు

సూర్యాపేట రూరల్, జూలై 19: సూర్యాపేట జిల్లా కేంద్రానికి ఐదు కిలోమీటర్ల దూరంలో ఉన్న ప్రసిద్ధ పిల్లలమర్రి శివాలయాలను కాశీ ప్రాంతానికి చెందిన ఆరుగురు అఘోరాల బృందం శుక్రవారం మధ్యాహ్నం సందర్శించింది. వాహనంలో కాశీ నుంచి రామేశ్వరం వెళుతూ మార్గమధ్యలోని శివాలయాలను దర్శించుకుంటున్నట్లు అఘోరాలు తెలిపారు. మధ్యాహ్నం 12గంటల నుంచి 12.30 గంటల వరకు ఆలయంలో అఘోరాలు పూజలు చేశారు. ప్రతిఏటా కాశీ నుంచి రామేశ్వరానికి వెళతామని అఘోరాలు తెలిపారు. ఈ సందర్భంగా ఆలయ చరిత్రను అర్చకుడు నాగేంద్రశర్మ అఘోరాలకు వివరించారు.

ప్రశాంతంగా డీఎస్సీ పరీక్షలు

నల్లగొండ, జూలై 19: నల్లగొండ జిల్లా కేంద్రంలో డీఎస్సీ పరీక్షలు ప్రశాంతంగా కొనసాగుతున్నాయి. రెండో రోజైన శుక్రవారం ఉదయం పరీక్షకు 185మందికి 10 మంది అభ్యర్థులు హాజరుకాలేదు. అదేవిధంగా మధ్యాహ్నం నిర్వహించిన పరీక్షకు 59మంది అభ్యర్థులకు ముగ్గురు గైర్హాజరయ్యారు.

డీఎంహెచ్‌వోగా పుట్ట శ్రీనివాస్

నల్లగొండ, జూలై 19: నల్లగొండ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారిగా డాక్టర్ పుట్ట శ్రీనివాస్ నియమితులైనట్లు సమాచారం. ప్రస్తుతం ఆయన సిద్ధిపేట డీఎంహెచ్‌వోగా చేస్తున్నారు. శుక్రవారం హైదరాబాద్‌లో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో శ్రీనివాస్‌ను నల్లగొండకు బదిలీచేస్తూ ఉత్తర్వులు రానున్నట్లు సమాచారం. ఇన్‌చార్జి డీఎంహెచ్‌వోగా ఉన్న కల్యాణచక్రవర్తి తిరిగి క్షయ నివారణ అధికారిగా వెళ్లనున్నారు. శ్రీనివాస్ సోమవారం బాధ్యతలు స్వీకరించే అవకాశం ఉంది.

ఎనిమిది నిమిషాల్లో బంగారు దుకాణం చోరీ

● రూ.10.80లక్షల సొత్తు అపహరణ



చోరీ చేసేందుకు ఆదిత్య జువెల్లరీ దుకాణం షట్టర్ ఎత్తిన దృశ్యం(రౌండప్‌లో)

భువనగిరి టౌన్, జూలై 19: యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రం భువనగిరిలో గురువారం అర్ధరాత్రి సినీఫక్కీలో ఎనిమిది నిమిషాల్లో ఏడుగురు దొంగలు బంగారు దుకాణంలో చోరీ చేశారు. ముగ్గురు కాపలాగా ఉండగా, నలుగురు లోపలికి వెళ్లి చోరీచేసి తాపీగా నడుచుకుంటూ వెళ్లారు. ఈ ఘటనలో రూ.10.80లక్షల విలువైన సొత్తు అపహరణకు గురైంది. పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. స్వర్ణకారుల బజారులోని ఆదిత్య జువెల్లరీ యజమాని ఆకునూరి ఆదిత్య రోజు మాదిరిగానే గురువారం రాత్రి దుకాణాన్ని మూసివేసి ఇంటికి వెళ్లాడు. అయితే అర్ధరాత్రి 12.18 గంటలకు నడుచుకుంటూ వచ్చిన ఏడుగురు దొంగల ముఠా దుకాణం షట్టర్‌ను వెంట తెచ్చుకున్న ఇనుపరాడ్లతో సుమారు అడుగున్నర ఎత్తు ఎత్తారు. నలుగురు లోనికి ప్రవేశించగా, ముగ్గురు బయట కాపలాగా ఉన్నారు. దుకాణంలో ఉన్న రూ.5.50లక్షల విలువైన 5.50కిలోల వెండి ఆభరణాలు, ఏడు తులాలకు సమానమైన రూ.4.90లక్షల విలువైన బంగారు ఆభరణాలు, రూ.40వేల నగదును ఎనిమిది నిమిషాల వ్యవధిలో దోచుకొని తిరిగి 12.26గంటలకు బయటకువచ్చారు. ఇదంతా జువెల్లరీ దుకాణం పక్కన ఉన్న మరో దుకాణం ముందు ఏర్పాటు చేసిన సీసీ కెమెరాలో నమోదైంది. అయితే జువెల్లరీ దుకాణ షెటర్‌ను బలవంతంగా తెరుస్తుండగా వీధికుక్కల అరుపులకు అదే బజారులో రెండో అంతస్తులో ఉంటున్న కొందరు బయటకు వచ్చి చుట్టుపక్కల గమనించారు. చోరీ విషయం గమనించి కేకలు వేస్తుండగానే దొంగల ముఠా తాపీగా నడుచుకుంటూ దుకాణ వెనక గల్లీ వైపు వెళ్లిపోయింది. అదేసమయంలో స్వర్ణకారుల బజార్ గూర్ఖా కూడా చోరీ జరిగిన దుకాణం సమీపానికి ఈల ఊదుకుంటూ వస్తుండడం, మరికొందరు స్థానికులు అదే రోడ్డు వెంట రాకపోకలు సాగిస్తుండగానే సినీ ఫక్కీలో చోరీ జరగడంతో స్థానికంగా సంచలనం సృష్టించింది. స్థానికుల సమాచారం అందుకున్న పోలీసులు అర్ధరాత్రి సంఘటనా స్థలానికి చేరుకొని పరిసరాల్లో వెతికినప్పటికీ దొంగల ఆచూకీ లభించలేదు. పోలీసులు జువెల్లరీ యజమాని ఆదిత్యకు సమాచారం ఇచ్చి రప్పించారు. శుక్రవారం ఉదయం క్లూస్ టీం చోరీ జరిగిన దుకాణంలో ఆధారాలను సేకరించింది. అయితే దొంగల ముఠా తెలుగులోనే సంభాషించుకున్నట్లు స్థానికులు తెలిపారు. పక్కాగా రెక్కీ నిర్వహించాకే చోరీ చేసినట్లు పోలీసులతో పాటు పలువురు భావిస్తున్నారు. ఆదిత్య జువెల్లరీ దుకాణయజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పట్టణ ఇన్‌స్పెక్టర్ సురేష్‌కుమార్ తెలిపారు. పరిసరా ప్రాంతాల్లోని సీసీ కెమెరాల ఫుటేజీలను పోలీసులు సేకరించారు.

సొత్తు దాచిన విషయం మరిచి... చోరీ అని అరిచి


వివరాలు సేకరిస్తున్న పోలీసులు

వలిగొండ, జూలై 19 : ఇంట్లో సొత్తు దాచిన విషయాన్ని మరిచిపోయి, బీరువా తెరిచి ఉందన్న భయంతో చోరీ జరిగిందని పోలీసులను పిలిపించిన సంఘటన యాదాద్రిభువనగిరి జిల్లా దాసిరెడ్డిగూడెంలో శుక్రవారం జరిగింది. ఎస్ఐ మహేందర్, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. దాసిరెడ్డిగూడెం గ్రామానికి చెందిన నారి లింగస్వామి వ్యవసాయదారుడు. భార్య, ఇద్దరు పిల్లలు, తల్లితో కలిసి నివసిస్తున్నాడు. శుక్రవారం లింగస్వామి తన వ్యవసాయ పనుల నిమిత్తం పొలానికి వెళ్లాడు. పిల్లలిద్దరూ స్కూల్‌కు వెళ్లాక భార్య నవనీత కూలీ పనులకు వెళ్లింది. ఇంట్లో ఉన్న తల్లి మల్లమ్మ బీరువాలోని ఆభరణాలు, నగదు తీసి వేరేచోట దాచింది. ఆ క్రమంలో బీరువా తలుపు తెరిచి పెట్టడం మరిపోయింది. ఆ తర్వాత వ్యవసాయ బావి వద్దకు వెళ్లింది. భోజన సమయానికి లింగస్వామి ఇంట్లోకి వచ్చే సరికి బీరువా తెరిచి ఉండి బట్టలు చిందరవందరగా పడి ఉన్నాయి. వెంటనే కుటుంబ సభ్యులకు ఫోన్ ద్వారా సమాచారం ఇచ్చారు. వారు ఇంటికి చేరుకొని బీరువాలో ఉన్న 14 తులాల బంగారు ఆభరణాలు, రూ.2లక్షల నగదు, 30 తులాల వెండి ఆభరణాలు కనిపించడం లేదని పోలీసులకు సమాచారం చేరవేశారు. సంఘటనా స్థలానికి రామన్నపేట సీఐ వెంకటేశ్వర్లు, ఎస్ఐ మహేందర్ చేరుకొని బాధితుల నుంచి సమాచారం సేకరించారు. డాగ్ స్క్వాడ్, ఫింగర్ ప్రింట్ సిబ్బంది చేరుకొని వివరాలు సేకరిస్తుండగా, ఇంట్లోనే వేరేచోట సొత్తు దాచిన విషయం మల్లమ్మ గుర్తుకు వచ్చింది. వెంటనే కుమారుడికి చెప్పగా సదరు సొత్తు, ఆభరణాలు భద్రంగానే ఉన్నాయి. ఈ సంఘటన గ్రామంలో హల్‌చల్ అయ్యింది.

108 వాహనంలో ప్రసవం


తండ్రి నర్సింహకు చిన్నారిని అందజేస్తున్న సిబ్బంది

భువనగిరి రూరల్, జూలై 19 : పురిటి నొప్పులతో బాధపడుతున్న గర్భిణికి 108 అంబులెన్స్‌లో సిబ్బంది సుఖప్రసవం జరిపించారు. యాదాద్రిభువనగిరి జిల్లా కేంద్రంలోని భువనగిరికి చెందిన శాంతికి శుక్రవారం తెల్లవారు జామున పురిటినొప్పులు రావడంతో 108 వాహనంలో జిల్లా కేంద్ర ఆసుపత్రికి తీసుకువచ్చారు. 3వ కాన్పు కోసం ఆమెను ఆసుపత్రికి తీసుకురాగా పరీక్షించిన వైద్యులు రక్తహీనత తక్కువగా ఉందని సూచించడంతో అదే వాహనంలో సికింద్రాబాద్‌లోని గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్తున్నారు. మార్గమధ్యలోని జిల్లా కేంద్ర ఆసుపత్రికి ఐదు కిలోమీటర్ల పరిధిలోని పగిడిపల్లిలో నొప్పులు ఎక్కువ అవడంతో వాహనాన్ని అక్కడే నిలిపివేసి సిబ్బంది సుఖప్రసవం అయ్యేలా చూశారు. శాంతి ఆడబిడ్డకు ఆమె జన్మనిచ్చింది. భర్త నర్సింహకు చిన్నారిని అప్పగించారు.తల్లీ, బిడ్డ క్షేమంగా ఉన్నారు. అంబులెన్స్ ఇఎంటీ రాజేందర్, పైలెట్ అంగడి మహేశ్‌ను శాంతి కుటుంబ సభ్యులు అభినందించారు.

రుణమాఫీ జాబితాను ప్రభుత్వం బయట పెట్టాలి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న బండా నరేందర్‌రెడ్డి

నల్లగొండ, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం రుణమాఫీ జాబితాను వెంటనే బయటపెట్టాలని జిల్లా పరిషత్ తాజా మాజీ చైర్మన్ బండా నరేందర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. రుణమాఫీ జాబితాపై స్పష్టత లేదని, చాలామంది రైతులకు రూ.లక్ష రుణమాఫీ చేయకుండా మోసం చేశారని ఆరోపించారు. ఏం చేయకున్న ప్రభుత్వం సంబురాలు చేసుకుంటుంటే రైతులు అయోమయంలో ఉన్నారన్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.945కోట్ల రుణమాఫీ చేస్తే బీఆర్ఎస్ ప్రభుత్వం రూ.1044కోట్ల రుణమాఫీ చేసిందని గుర్తుచేశారు. లబ్ధిదారులను కుదించే కుట్రలో భాగంగానే కాంగ్రెస్ ప్రభుత్వం స్పష్టత ఇవ్వడం లేదన్నారు. రైతులందరికీ రుణమాఫీ చేయాలన్నారు. అదేవిధంగా రైతుబంధు డబ్బులు ఇవ్వాలన్నారు. హరీ‌ష్‌రావును రాజీనామా చేయడం అడిగే హక్కు కాంగ్రెస్ నాయకులకు లేదన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి చిత్తశుద్ధి ఉంటే 100శాతం రుణమాఫీ చేయాలన్నారు. సమావేశంలో జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ రెగెట్టే మల్లికార్జున్‌రెడ్డి, మునిసిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు నిరంజన్‌వలీ, మాలే శరణ్యరెడ్డి, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, బక్క పిచ్చయ్య, జమాల్ ఖాద్రీ, దేప వెంకట్ రెడ్డి, వీరమళ్ల భాస్కర్, రంజిత్ తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ రుణమాఫీ వర్తింపజేయాలి: జూలకంటి


విలేకర్ల సమావేశంలో మాట్లాడుతున్న రంగారెడ్డి

నిడమనూరు, జూలై 19: ఎలాంటి కొర్రీలు లేకుండా అర్హులైన ప్రతీ రైతుకూ రుణమాఫీ వర్తింపజేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం నల్లగొండ జిల్లా నిడమనూరులో విలేకరులతో మాట్లాడుతూ రుణమాఫీ విషయంలో ప్రభుత్వనిర్ణయంతో అర్హులైన కొందరు రైతులు నష్టపోతున్నారని, కుటుంబం ప్రాతిపదికన ఎలాంటి షరతులు లేకుండా అమలుచేయాలన్నారు. వ్యవసాయం కోసం తీసుకున్న అన్నిరకాల పంట రుణాలకు మాఫీ అమలు చేస్తేనే రైతుకు న్యాయం జరుగుతుందన్నారు. రుణాలు రీషెడ్యూలు చేసిన వారికి, కౌలు రైతులకు కూడా మాఫీ అమలుచేయాలన్నారు. వ్యవసాయరంగ అభివృద్ధికి ప్రభుత్వం నిపుణులతో చర్చించి సరైన ప్రణాళికను రూపొందించి, పకడ్బందీగా అమలు చేయాలన్నారు. సమావేశంలో నాయకులు కొండేటి శ్రీను, కందుకూరి కోటేష్ పాల్గొన్నారు.

పెంచిన వేతనాలు చెల్లించాలి : ఏఐటీయూసీ

దేవరకొండ, జూలై 19: ప్రభుత్వ ఆస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులకు పెంచిన వేతనాలు వెంటనే చెల్లించాలని ఏఐటీయూసీ దేవరకొండ డివిజన్ కోశాధికారి జూలూరి వెంకట్రాములు డిమాండ్ చేశారు. సంఘం ఆధ్వర్యం లో దేవరకొండ ప్రభుత్వ ఆస్పత్రి ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. కాంట్రాక్ట్ కార్మికులకు పెంచిన వేతనాలు ఈ నెల 22వ తేదీ లోగా ఇవ్వకుంటే సంఘం ఆధ్వర్యంలో సమ్మె చేస్తామన్నారు. కార్యక్రమంలో కాంట్రాక్ట్ ఉద్యోగులు రామేశ్వరమ్మ, భద్రమ్మ, వెంకటయ్య, వనజ, శారద, లక్ష్మి పాల్గొన్నారు.

డిండి: పది నెలలుగా పెండింగ్‌లో ఉన్న గ్రామపంచాయతీ కార్మికుల వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. ఎంపీడీవో కార్యాలయం ఎదుట శుక్రవారం ధర్నా నిర్వహించారు. ఏఐటీయూసీ నాయకుడు నూనె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ గ్రామపంచాయతీలో పనిచేస్తున్న కార్మికులకు కనీస వేతనం రూ.20వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు. జీవో 51ని రద్దు చేసి జీవో 60ను అమలు చేయాలని కోరారు. కార్యక్రమంలో రమావత్ జవహర్‌లాల్, రమావత్ రాములు, గణేష్, పరమేష్, భారతి, సుజాత, లక్ష్మీ పాల్గొన్నారు.

'నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు'

మిర్యాలగూడ టౌన్, జూలై 19: నిబంధనలు అతిక్రమించి భవనాలు నిర్మిస్తే చర్యలు తీసుకుంటామని మునిసిపల్ కమిషనర్ ఎండీ. యుసుఫ్ అన్నారు. పట్టణంలోని పలు కాలనీల్లో నిబంధనలకు విరుద్ధంగా నిర్మించిన కట్టడాలను టీపీఎస్ అధికారులతో కలిసి శుక్రవారం పరిశీలించి కూల్చి వేయించారు. రహదారులు, ప్రభుత్వ స్థలాలను ఆక్రమించిన కట్టడాలను కూల్చి వేస్తామన్నారు. రెడ్డీకాలనీ, చర్చిరోడ్డు, పెద్దబజారులో రహదారులను ఆక్రమించి క్రీపాయింట్లు, ఇతర వ్యాపారాలు జరుపుతున్నట్లు తమ దష్టికి వచ్చిందన్నారు. పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు అక్బర్, మౌలానా, బాబా, పాషా తదితరులు పాల్గొన్నారు.

రైతులను మభ్యపెడుతున్న ప్రభుత్వం : బీజేపీ

మిర్యాలగూడ టౌన్, జూలై 19: ప్రభుత్వం రైతులను మభ్యపెడుతోందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సాదినేని శ్రీనివాసరావు విమర్శించారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. రుణమాఫీ లబ్ధిదారుల ఎంపిక, ఖాతాల్లో నిధుల జమ అంతా మాయ మంత్రంలా ఉందన్నారు. రూ.లక్ష రుణాలకు అసలు, వడ్డీతో కలిపి వేయాల్సి ఉండగా, అసలు రుణాలు మాఫీ చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం రైతులను మోసం చేస్తోందన్నారు. సమావేశంలో తుమ్మలపల్లి హన్మంతరెడ్డి, చిలుకూరి శ్యాం, అశోక్, మేడి నవీన్ పాల్గొన్నారు.

'కృష్ణారెడ్డి ఆశయాలు సాధించాలి'

నార్కట్‌పల్లి, జూలై 19: అణగారిన వర్గాల కోసం ఉద్యమించిన నాయకుడు పజ్జూరి కృష్ణారెడ్డి ఆశయాలు సాధించాలని సీపీఐఎంఎల్ న్యూ డెమోక్రసీ రాష్ట్ర నాయకుడు మందారి డేవిడ్‌కుమార్ అన్నారు. వరంగల్ జిల్లా సరసనపల్లి ఎన్‌కౌంటర్‌లో అమరుడైన నార్కట్‌పల్లి మండలంలోని పల్లెపహాడ్‌కు చెందిన పజ్జూరి కృష్ణారెడ్డి వర్ధంతి సందర్భంగా శుక్రవారం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. పెత్తందార్లు, భూస్వాముల ఆగడాలకు వ్యతిరేకంగా అశేష బాధిత ప్రజల విముక్తి కోసం నిర్బంధాలను ఎదుర్కొని పోరాడిన చరిత్ర కృష్ణారెడ్డిది అని అన్నారు. కార్యక్రమంలో సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ నాయకురాలు కృష్ణారెడ్డి పజ్జూరి ఉపేంద్ర, రంజిత్, నవ్య, సాగర్, జ్వాల వెంకటేశ్వర్లు, అంబటి చిరంజీవి, పోలే పవన్, బండారు వెంకన్న, నర్సయ్య, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు అమలు చేయాలి

నల్లగొండ టౌన్, జూలై 16: ఎన్నికల ముందు ఉద్యమకారులకు ప్రభుత్వం ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేయాలని తెలంగాణ ఉద్యమకారులు ఫోరం రాష్ట్ర ఉపాధ్యక్షుడు షేక్ ముస్తాఫా, ఉమ్మడి జిల్లా కన్వీనర్ దాసరి వెంకన్న డిమాండ్ చేశారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జయశంకర్ పార్క్‌లో నిర్వహించిన ఉద్యమకారుల ఫోరం సమావేశంలో మాట్లాడారు. తెలంగాణ ఉద్యమకారులపై పోలీసు కేసులను ఎత్తివేసి తొలి, మలిదశ ఉద్యమకారులకు గుర్తింపు పత్రాలు ఇవ్వాలన్నారు. అనంతరం మాడుగులపల్లి, తిప్పర్తి మండలాల కమిటీలను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. మాడుగులపల్లి మండల అధ్యక్షుడిగా మైనం రాంబాబు, ఉపాధ్యక్షుడిగా బోరాజు నాగరాజు, ప్రధాన కార్యదర్శిగా మేడి ఇమ్మానుయేల్, కార్యదర్శిగా ఎర్రమాద శ్రీనివాస్‌రెడ్డి, తిప్పర్తి అధ్యక్షుడిగా బొంగరాల అంజయ్య, ప్రధానకార్యదర్శిగా ఎండీ నదీం, ఉపాధ్యక్షుడిగా జాకటి ఆనంద్‌ను ఎన్నుకొని నియామక పత్రాలను అందజేశారు. సమావేశంలో ఫోరం జిల్లా ఉపాధ్యక్షుడు అప్పలనాయుడు మధు, లవిశెట్టి రవి, ఊదరి ఆనంద్, పాల్గొన్నారు.

గృహలక్ష్మి పథకం ఇళ్ల నిర్మాణం చేపట్టాలి

నల్లగొండ రూరల్, జూలై 19: రాష్ట్ర ప్రభుత్వం పేదలకు గృహలక్ష్మీ పథకం కింద ఇళ్లు నిర్మించి ఇవ్వాలని వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కలకొండ కాంతయ్య డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక ముగ్దుం భవనలో జరిగిన జిల్లా వ్యవసాయ కార్మిక సంఘం కౌన్సిల్ సమావేశంలో మాట్లాడారు. కాంగ్రెస్ మేనిఫెస్టోలో పేర్కొన్న విధంగా ఇంటి స్థలం లేని పేదలకు స్థలం ఇచ్చి రూ.6లక్షలు, స్థలం ఉన్న పేదలకు ఇంటి నిర్మాణానికి రూ.6లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సంఘం జిల్లా అధ్యక్షుడు లోడంగి శ్రవణ్‌కుమార్, జిల్లా ప్రధాన కార్యదర్శి బోల్గూరి నరసింహ, జిల్లా ఉపాధ్యక్షుడు సిహెచ్.ఉషయ్య, వేముల బుచ్చయ్య, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలి

మాడ్గులపల్లి, జూలై 19: ప్రభుత్వ కార్యాలయాలకు సొంత భవనాలు నిర్మించాలని సీపీఎం జిల్లా కార్యదర్శి ముదిరెడ్డి సుధాకర్‌రెడ్డి అన్నారు. మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. మాడ్గులపల్లి మండలం ఏర్పడి ఎనిమిది సంవత్సరాలు అవుతున్నా ఇప్పటివరకు ఎంపీడీవో, పోలీస్‌స్టేషన్, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, విద్యార్థుల వసతి గృహాలకు సొంత భవనాలు లేవన్నారు. అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ అధికారులు పనిచేయాల్సి వస్తుందన్నారు. సమావేశంలో సీపీఎం మండల కార్యదర్శి రొండి శ్రీనివాస్, నాయకులు దేవిరెడ్డి అశోక్‌రెడ్డి, బొమ్మకంటి అంజయ్య, పతాని శ్రీను, తంగెళ్ల నాగమణి, జూకూరి నాగయ్య, ఉరుగొండ శ్రీను పాల్గొన్నారు.

కళాకారులకు గుర్తింపుకార్డులు ఇవ్వాలి

దేవరకొండ, జూలై 19: జానపద, యక్షగాన, బాగోతం కళాకారులకు ప్రభుత్వం గుర్తింపుకార్డులు ఇవ్వాలని తెలంగాణ రాష్ట్ర ప్రజానాట్యమండలి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పల్లె నర్సింహ కోరారు. దేవరకొండలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. జానపద, యక్షగానతోపాటు కళాకారులు వృత్తినే నమ్ముకొని జీవనం కొనసాగిస్తున్నారన్నారు. గ్రామాల్లో అంతరించిపోతున్న కళలకు జీవం పోసి వృత్తి కళాకారులు జీవం పోస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వం జానపద కళాకారులకు ప్రత్యేక నిధి కేటాయించి ఆదుకోవాలని కోరారు. ఈ సమావేశంలో కళాకారులు రాములు, సైదులు, లాలమ్మ, జ్యోతి, జయమ్మ, బుజ్జి తదితరులు పాల్గొన్నారు.

గ్రామీణ వైద్యులను ప్రోత్సహించడం హర్షనీయం

హాలియా, జూలై 19: గ్రామీణ వైద్యులను ప్రభుత్వం ప్రోత్సహిస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించడం హర్షిస్తున్నామని కాంగ్రెస్ అనుముల మండల అధ్యక్షుడు కుందూరు వెంకట్‌రెడ్డి, గ్రామీణ వైద్యుల సంఘం మండల అధ్యక్షుడు కత్తి కోటిరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. హాలియాలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి శుక్రవారం క్షీరాభిషేకం చేశారు. గ్రామీణ ప్రాంతాల్లో నిరుపేదలకు సేవలు అందిస్తున్న ఆర్ఎంపీ, పీఎమ్‌పీలకు ట్రైనింగ్ ఇచ్చి సర్టిఫికెట్లు అందజేయాలని సీఎం రేవంత్‌రెడ్డి అధికారులకు ఆదేశాలు ఇవ్వడం హర్షనీయమన్నారు.



డిండి మండలకేంద్రంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాలునాయక్



నకిరేకల్‌లో ట్రాక్టర్ నడుపుతున్న ఎమ్మెల్యే వేముల వీరేశం



చిట్యాల: పెద్దకాపర్తిలో క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

సంబురం



కొండమల్లేపల్లిలో నినాదాలు చేస్తున్న రైతులు, కాంగ్రెస్ నాయకులు



చింతపల్లిలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న రైతులు

ప్రతి హామీని నిలబెట్టుకుంటాం

డిండి, జూలై 19: వరంగల్ డిక్లరేషన్ ప్రకారం ఏకకాలంలో రూ.2లక్షల రుణమాఫీ చేసి రైతులకు ఇచ్చిన హామీని కాంగ్రెస్ పార్టీ నిలబెట్టుకుందని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. రుణమాఫీ సంబరాల్లో భాగంగా మండలకేంద్రంలో ఎడ్లబండ్లు, ట్రాక్టర్లతో రైతులు శుక్రవారం భారీ ర్యాలీ నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ మేరకు రుణమాఫీ చేసిందన్నారు. కార్యక్రమంలో నాయకులు దొంతినేని వెంకటేశ్వరరావు, రాజేష్‌రెడ్డి, టి. నాగార్జునరెడ్డి, గుర్రం రాములు, మల్‌రెడ్డి విష్ణువర్ధన్‌రెడ్డి, జంగారెడ్డి, యాదగిరిరావు, సిరాజ్‌ఖాన్, దామోదర్‌రావు పాల్గొన్నారు.

చింతపల్లి: రైతు శ్రేయస్సే ప్రభుత్వ ధ్యేయమని ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. మండలకేంద్రంలో రైతులతో కలిసి ట్రాక్టర్‌పై భారీ ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవానిపవన్‌కుమార్, దొంతం సంజీవరెడ్డి, నాగభూషణ్, వెంకటయ్యగౌడ్, ముచ్చర్ల యాదగిరి, రవినాయక్ పాల్గొన్నారు. వెంకటేశ్వరనగర్(మాల్)లో సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు.

నకిరేకల్: రైతును రారాజు చేయడమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే వేముల వీరేశం అన్నారు. పన్నాలగూడెంలోని ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయం నుంచి నకిరేకల్ మెయిన్ సెంటర్ వరకు రైతులతో కలిసి సంబరాల భారీ ర్యాలీ నిర్వహించారు. రుణమాఫీ చేసి సీఎం రేవంత్‌రెడ్డి రైతుల మన్నలు పొందుతున్నారన్నారు. కార్యక్రమంలో బీసీ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పూజార్ల శంభయ్య, చామల శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ నాగులవంచ వెంకటేశ్వర్‌రావు, పన్నాల రాఘవరెడ్డి, మాజీ ఎంపీపీ బచ్చుపల్లి శ్రీదేవి గంగాధర్‌రావు, యానాల లింగారెడ్డి పాల్గొన్నారు.

చిట్యాల: చిట్యాలలో సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి కాంగ్రెస్ నాయకులు, రైతులు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, నాయకులు పోకల దేవదాస్, జడల చినమల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

చిట్యాలరూరల్: మండలంలోని పలు గ్రామాల్లో సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఎమ్మెల్యే వేముల వీరేశంల చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ఉపాధ్యక్షుడు కందిమళ్ళ శిశుపాల్‌రెడ్డి, నీలకంఠం లింగస్వామి, గంట్ల రవీందర్‌రెడ్డి, పొట్లపల్లి రవి, పొట్లపల్లి నగేష్, మాజీ సర్పంచ్ జనగాం రవీందర్‌గౌడ్, వడ్డెపల్లి లక్ష్మయ్య, పామనగుళ్ళ బుచ్చిరాములు, పాల్గొన్నారు.

కొండమల్లేపల్లి: మండలకేంద్రంలోని చౌరస్తాలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ఉట్కూరి వేమన్‌రెడ్డి ఆధ్వర్యంలో సీఎం రేంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో నాయకులు కుంభం శ్రీనివాస్‌గౌడ్, పస్నూరి యుగంధర్‌రెడ్డి, నాయిని ప్రభాకర్‌రెడ్డి, అందుగుల ముత్యాలు, గంధం సురేష్, రమావత్ రవినాయక్, లాలునాయక్, కేతావత్ పాండునాయక్, శంకర్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి : ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

త్రిపురారం, జూలై 19: మొక్కలు నాటి సంరక్షించాలని ఎమ్మెల్యే కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో శుక్రవారం మొక్కలు నాటారు. మొక్కలు నాటితే వాతావరణంలో మార్పులు వచ్చి వర్షాలు అధికంగా కురుస్తాయన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ప్రమీల, ఇన్‌చార్జి ఎంపీవో రాజేందర్ కుమార్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ముడిమల్ల బుచ్చిరెడ్డి, అనుముల శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌నాయక్, బిట్టు రవికుమార్, అనుముల వెంకట్‌రెడ్డి, అలంపల్లి జానయ్య, పొలగాని సైదులు, ఉపాధ్యాయులు రవి, విష్ణుకుమార్ పాల్గొన్నారు.



త్రిపురారంలో మొక్క నాటుతున్న ఎమ్మెల్యే జైవీర్‌రెడ్డి

చింతపల్లి: మొక్కలు నాటేందుకు కృషి చేయాలని ఎంపీడీవో సుజాత అన్నారు. మండలకేంద్రంలో మొక్కలు నాటారు. సకాలంలో వర్షాలు సమృద్ధిగా కురవాలంటే ప్రతి ఒక్కరూ మొక్కలు నాటి సంరక్షించేందుకు ముందుకు రావాలన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ కొండూరి భవాని పవన్‌కుమార్, అంగిరేకుల శ్రీకాంత్, ఎండీ. ఇమ్రాన్, పాలకూర్ల రాజేష్‌గౌడ్ పాల్గొన్నారు.

శాలిగౌరారం: మొక్కలు నాటి వాటిని సంరక్షించాలని పీపుల్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ డైరెక్టర్ రెబ్బవరపు జెస్సీపాల్ అన్నారు. మండల పరిధిలోని వల్లాల గ్రామంలో శుక్రవారం మొక్కలు నాటారు. సంస్థ ప్రతినిధులు కర్నె ఏసుదాస్ మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం ద్వారా ఉచితంగా అంద జేస్తున్న మొక్కలు ప్రతిఒక్కరూ బాధ్యతగా తీసుకొని నాటాలన్నారు.

మిర్యాలగూడ పట్టణ ప్రగతికి సహకరించాలి

మిర్యాలగూడ, జూలై 19: మిర్యాలగూడ పట్టణ ప్రగతికి పంచ సూత్రాలు అమలు చేయాలని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ భవనంలో శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. పచ్చదనం, పరిశుభ్రత, ప్లాస్టిక్ రహిత, నిషేధిత మత్తు పదార్థాల నివారణ, విద్యాసంస్థల్లో మౌలిక వసతుల కల్పన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. పట్టణాన్ని కాలుష్యరహితంగా తీర్చిదిద్దేందుకు రైస్‌మిల్లర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో వన మహోత్సవ కార్యక్రమంలో భాగంగా మిల్లుకు 250మొక్కలు, ప్రజలకు ఉపయోగపడే వివిధ రకాల పండ్ల మొక్కలతో సుమారు 25వేల మొక్కలు తెచ్చి నాటి సంరక్షించే విధంగా ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గత వేసవిలో 46 నుంచి 48 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైందని, యాదాద్రి థర్మల్ పవర్‌ప్లాంట్ ఉత్పత్తి ప్రారంభిస్తే మరో మూడు లేదా నాలుగు డిగ్రీల ఉష్ణోగ్రత పెరిగే అవకాశం ఉన్నందున దానిని తగ్గించేందుకు నియోజకవర్గ వ్యాప్తంగా మొదటగా లక్ష మొక్కల లక్ష్యంగా వనమహోత్సవం నిర్వహిస్తామన్నారు. కార్యాలయానికి 25 చొప్పున మొక్కలు నాటే విధంగా అధికారులతో చర్చించినట్లు తెలిపారు. ప్లాస్టిక్ కవర్ల విక్రయాలును నిలిపివేయాలని వ్యాపారస్థులకు సూచించినట్లు చెప్పారు. గంజాయి లాంటి నిషేధిత మత్తుపదార్థాల వినియోగాన్ని, అక్రమ రవాణా అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు రూపొందించి అమలు చేస్తామన్నారు. ఆగస్టు 15లోగా కార్యక్రమాలు పూర్తిచేసి 10వేల మందితో జాతీయ జెండా వందన కార్యక్రమాన్ని నిర్వహిస్తామన్నారు. ఈ సమావేశంలో ఆర్డీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ హరిబాబు, రైసుమిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గౌరు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి వెంకటరమణ చౌదరి, కోశాధికారి చిల్లంచర శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి

విద్యార్థులకు మౌలిక సదుపాయాలు కల్పించాలి

దేవరకొండ, జూలై 19: ఎస్సీ, ఎస్టీ, బీసీ హాస్టల్ విద్యార్థులకు దుస్తులు, దుప్పట్లతోపాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ఆకారపు నరేష్, కంభంపాటి శంకర్ డిమాండ్ చేశారు. దేవరకొండలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి పట్టణంలో శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. అనంతరం దేవరకొండ ఆర్డీవో శ్రీరాములుకు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ దేవరకొండ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు రమావత్ లక్ష్మణ్‌నాయక్, బుడిగె వెంకటేష్, సిద్దు, చరణ్, రాములు, వహిద్, అనూష తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో డిప్యూటీ తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. ఎస్ఎఫ్ఐ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు నల్లబెల్లి జగదీష్, కోరె రమేష్ మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న బకాయిలను, మెస్, కాస్మోటిక్ చార్జిలను వెంటనే విడుదల చేయాలన్నారు. సంక్షేమ హాస్టళ్లలో చదువుతున్న పేద విద్యార్థులకు మెస్‌చార్జిలు పెంచాలన్నారు. కార్యక్రమంలో వల్లపు బ్రహ్మం, కాశీమల్ల శివ, పసుపులేటి నితిన్, మోహన్, గౌతమ్ ఉన్నారు.



తిరుమలగిరి(సాగర్)లో వినతిపత్రం అందజేస్తున్న విద్యార్థులు

నకిరేకల్: సంక్షేమ హాస్టల్ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని ఎస్ఎఫ్ఐ డివిజన్ కార్యదర్శి ముస్కు రవీందర్ డిమాండ్ చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ హాస్టల్ విద్యార్థులకు నోట్ పుస్తకాలు, దుస్తువులు, దుప్పట్లు వెంటనే పంపిణీ చేయాలని డిమాండ్ చేస్తూ ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో శుక్రవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. హాస్టల్‌లో ఉంటున్న నిరుపేద కుటుంబాల విద్యార్థులకు ఇప్పటి వరకు నోట్ పుస్తకాలు, దుస్తువులు, దుప్పట్లు ప్రభుత్వం పంపిణీ చేయకపోవడంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జమీరొద్దిన్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎన్నమల్ల ప్రవీణ్‌కుమార్, సంపంగి నవీన్, వినయ్, సందీప్, జగన్ తదితరులు పాల్గొన్నారు.

మిర్యాలగూడ: ఎస్సీ, ఎస్టీ, బీసీ సంక్షేమ వసతిగృహ విద్యార్థులకు దుప్పట్లు నోటు పుస్తకాలు అందించాలని ఎస్ఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షులు కుర్ర సైదానాయక్ కోరారు. తహసీల్దార్ హరిబాబుకు వినతిపత్రం అందజేశారు. నూతన విద్యాసంవత్సరం ప్రారంభమై నెలరోజులు గడుస్తున్నా ఎస్సీ, ఎస్టీ బీసీ సంక్షేమ హాస్టల్స్, కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలల్లో నోట్‌పుస్తకాలు, స్కూల్‌యూనిఫామ్స్, ట్రంక్‌బాక్స్‌లు, దుప్పట్ల లాంటివి అందజేయలేదన్నారు. జిల్లాలో 46 ఎస్టీ హాస్టల్స్‌లో 3200మంది, 13 గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సుమారు 5000 మంది విద్యార్థులుబీసీ సంక్షేమ వసతిగృహాలు, 25 ప్రీ మెటిక్ హాస్టల్స్‌లో 2200 మంది విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. కార్యక్రమంలో వీరన్న, మునీనాయక్, గణేష్, అరుణ్, సిపాయి, రవి, నుమాన్, హరి పాల్గొన్నారు.

నిడమనూరు: కాంగ్రెస్ సీనియర్ నాయకుడు మేరెడ్డి వెంకట్‌రాహుల్ మాతృమూర్తి ఛాయాదేవికి శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి, సీఎల్పీ మాజీ నాయకుడు కుందూరు జానారెడ్డి, పలువురు ఎమ్మెల్యేలు, వివిధ పార్టీల నాయకులు నివాళులర్పించారు. ఛాయాదేవి ప్రథమ వర్ధంతి సందర్భంగా నిడమనూరు మండల కేంద్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆమె చిత్రపటానికి పూలమాలలు సమర్పించి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బత్తుల లక్ష్మారెడ్డి, కుందూరు జైవీర్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే భాస్కర్‌రావు, శంకర్‌నాయక్, కొండేటి మల్లయ్య, రంగశాయిరెడ్డి, చేకూరి హనుమంతరావు, నందికొండ మట్టారెడ్డి, అంకతి వెంకటరమణ, అంకతి సత్యం, బుసిరెడ్డి పాండురంగారెడ్డి, కొండా శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

తిరుమలగిరి(సాగర్): చిన్నారుల కోసం ప్రభుత్వం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పిల్లలను చేర్పించాలని హెచ్‌ఎం సత్యనారాయణ అన్నారు. మండలకేంద్రంలో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ప్రభాకర్‌రెడ్డి, సులోచనరాణి, వెంకట్‌రెడ్డి, అంగన్‌వాడీ టీచర్లు కళావతి, పుష్ప, రమణ, పాపమ్మ పాల్గొన్నారు.

మర్రిగూడ: మూడు సంవత్సరాల నుంచి ఆరు సంవత్సరాల పిల్లలను అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ పద్మ అన్నారు. శివన్నగూడ, అంతం పేటలో విద్యార్థులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో అంతంపేట, శివన్నగూడ అంగన్వాడీ టీచర్లు విజయశ్రీ, సువర్ణ, అనసూయ, కళమ్మ, అంబిక, సునిత తదితరులు పాల్గొన్నారు.

పెద్దవూర: పూసలిచాకలి వారికి ఇళ్ల స్థలాలు స్థలాలు ఇవ్వాలని మండలంలోని పోతునూరు గ్రామస్థులు కోరారు. మండలకేంద్రంలో తహసీల్దార్ సరోజకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో వెంకటయ్య, గోవర్ధన్, ఎలిజాల యాదమ్మ, పొదిల నాగలక్ష్మీ, శ్రీను పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం..

డిండి: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ అమలు చేయాలని సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు బొడ్డుపల్లి వెంకటరమణ, జిల్లా కౌన్సిల్ సభ్యులు బుచ్చిరెడ్డి డిమాండ్ చేశారు. మండలకేంద్రంలోని పార్టీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన మాట్లాడారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి ఎస్ఆర్. కనకచారి, ఎండి. ఫైనొద్దిన్, విజేందర్‌రెడ్డి, శైలేజ్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి జడ్పీహెచ్ఎస్ పాఠశాల(1988-89 బ్యాచ్)కు చెందిన విద్యార్థులు సూక్తుల బోర్డులను శుక్రవారం బహూకరించారు. విద్యార్థుల ఉత్తమ భవితకు బాటలు వేసేలా కూడిన 60 సూక్తుల కు సంబంధించిన బోర్డులను పాఠశాల హెచ్ఎం దునుక రాములుకు అందజేశారు. కార్యక్రమంలో దాసరి శ్రీరాములు, అర్థం శ్రీనివాస్ పాల్గొన్నారు.

నార్కట్‌పల్లి: నార్కట్‌పల్లి జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులచే ఏర్పాటు చేసిన స్వాన్ స్వచ్ఛంద సంస్థ చేస్తున్న సేవలు ప్రశంసనీయమని ఎస్ఆర్ఐ నల్లుటి నరేశ్‌రెడ్డి అన్నారు. స్వాన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మామిళ్ల సత్తిరెడ్డి ప్రోత్సాహంతో ఏర్పాటైన స్వాన్ సంస్థ చేస్తున్న కార్యక్రమాలను చూసి విరాళంగా రూ.10వేలు అందజేశారు. కార్యక్రమంలో మెరుగు శ్రావణ్‌కుమార్, నవీన్‌కుమార్ ఉన్నారు.

మునుగోడు రూరల్: బీజేపీ ఓబీసీ మోర్చా జనగామ జిల్లా ఇన్‌చార్జిగా మునుగోడు మండలం పులిపలుపుల గ్రామానికి చెందిన ముంగి ధనుంజయ నియమితులయ్యారు. సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఆనంద్‌గౌడ్ ఉత్తర్వులు జారీచేశారు. తన నియామకానికి సహకరించిన సంఘం నాయకులకు సైదిరెడ్డి కృతజ్ఞతలు తెలిపారు.

కేతేపల్లి: హైదరాబాద్ ఎల్‌బీ.నగర్ కామినేని ఆసుపత్రి ఆధ్వర్యంలో ఈ నెల 21న మండల కేంద్రం కేతేపల్లిలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఆసుపత్రికి చెందిన బి.యాదగిరి తెలిపారు.

మర్రిగూడ: సేవా దృక్పథంతో విద్యార్థులకు నోట్ పుస్తకాలు, బ్యాగులు ఉచితంగా పంపిణీ చేయడం అభినందనీయమని ప్రధానోపాధ్యాయులు రాజేష్ అన్నారు. మండలంలోని నల్లపురాజుపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు కస్తూరి ఫౌండేషన్ సౌజన్యంతో బ్యాగులను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు ఉన్నారు.

మర్రిగూడ: మండలంలోని లెంకలపల్లిలో పారిశుధ్య కార్మికులు నీటి నిల్వ ఉన్న గుంతలలో బ్లీచింగ్ పౌడర్ చల్లారు. గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ ఇంటిముందు పారిశుధ్యంగా ఉంచుకోవాలని సూచించారు.

ఉపాధ్యాయ వృత్తి గొప్పది



బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను సన్మానిస్తున్న మాజీ ప్రజాప్రతినిధులు

గట్టుప్పల్, జూలై 19: ఎంతో మంది పేదల విద్యార్థులను ఉన్నత స్థాయికి తీసుకెళ్లే ఉపాధ్యాయ వృత్తి గొప్పదని మాజీ ఎంపీటీసీలు కంప దుర్గయ్య, చాపల మారయ్య అన్నారు. వెల్మకన్నె జడ్పీహెచ్ఎస్ హైస్కూల్ బదిలీపై వెళ్తున్న ఉపాధ్యాయులను శుక్రవారం సన్మానించారు. పది సంవత్సరాలుగా గ్రామాల్లో ఎంతో మంది విద్యార్థులను ఉన్నతస్థాయికి తీసుకెళ్లిన ఉపాధ్యాయుల కృషి గొప్పదన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చలమల్ల వెంకట్ రెడ్డి, హెచ్ఎం సుభాష్ చంద్ర, ఎస్ఎంసీ చైర్మన్ పారిజాత, నాయకులు రావుల పర్వతాలు, బీమనపల్లి రమేష్, బాల మహేష్ తదితరులు పాల్గొన్నారు.

సేవా కార్యక్రమాల్లో ముందుంటాం

నార్కట్‌పల్లి, జూలై 19: సేవ.. స్నేహం.. నాయకత్వమే.. ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ(వామ్) నినాదమని ఆ సంస్థ గ్లోబల్ కోశాధికారి ఎల్‌వీ కుమార్ అన్నారు. నార్కట్‌పల్లిలోని వాసవీభవన్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. వామ్ సంస్థ ప్రపంచ వ్యాప్తంగా 50 దేశాల్లో విస్తరించి ఉందని, సామాజిక సేవా కార్యక్రమాలు చేపట్టడంలో ముందుంటుందన్నారు. ఈ నెల 28న హైద్రాబాద్‌లోని కాచిగూడ వైశ్య హాస్టల్‌లో వామ్ ఆధ్వర్యంలో జరిగే సమావేశానికి ఆర్యవైశ్యులు హాజరుకావాలని కోరారు. సమావేశంలో వామ్ సీనియర్ సిటిజన్ గ్లోబల్ చైర్మన్ పూర బాబూరావు, కొత్త వెంకటేశ్వర్లు, ఓరుగంటి సుధాకర్, రమేశ్, చెన్న కేశవులు, నార్కట్‌పల్లి ఆర్యవైశ్య సంఘం నాయకులు పాల్వాయి భాస్కర్‌రావు, ఇడుకుళ్ల బిక్షమయ్య, రంగ శేఖర్, చల్లా వాసుదేవ్, దోసపాటి ప్రసాద్, పసునూరి పాండురంగయ్య పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

హాలియా, జూలై 19: ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలని పీఆర్టీయూ అనుముల మండల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చెన్ను వెంకట్‌రెడ్డి, మంచికంటి మధు కోరారు. మండలంలోని జెడ్‌పీహెచ్ఎస్ పులిమామిడి, మారేపల్లి, యాచారం, చింతగూడెం, చల్లారెడ్డిగూడెం, కొత్తపల్లి, హాలియాలో శుక్రవారం సంఘం సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు కొల్లి శ్రీనివాస్‌రెడ్డి, గుర్రం రవి, మంద గౌతం, హైమద్, రాములు, లోక్యనాయక్, హరివర్ధన్, సైదిరెడ్డి, నర్సింహారెడ్డి, ముస్తాఫా, వెంకట్‌రెడ్డి, శివ, ప్రసాద్, కృపాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మాడ్గులపల్లి: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కాలం నారాయణరెడ్డి, ప్రధానోపాధ్యాయుడు వెంకటమ్మ, సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు లక్ష్మణ్‌నాయక్, పద్మ, దయాకర్, వేణుగోపాల్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, ఇంతియాజ్, శ్రీనివాస్‌రెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, సైదిరెడ్డి, లింగారెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రమేష్, మొయినొద్దీన్, నిర్మల, వినోద పాల్గొన్నారు.

వేములపల్లి: మండలంలోని ఆదర్శ పాఠశాలతోపాటు పలు పాఠశాలల్లో టీఎస్ పీఆర్‌టీయూ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో రాజు, సత్యనారాయణ, విజయలక్ష్మీ, శ్రీనివాస్‌రెడ్డి, సైదిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గట్టుప్పల్: మండలంలో పీఆర్‌టీయూ సభ్యత్వాలు నమోదు చేయించారు. కార్యక్రమంలో డీవీఎస్ ఫణికుమార్, ఓగోటి శంకర్, యూసఫ్ పాషా, హెచ్ఎం అమృతాదేవి, ఆవుల మధుసూదన్, కొమరయ్య, శ్రీనివాస్, నక్క వెంకట్, శ్రీనివాస్ రెడ్డి, అరుణకుమారి, యాదయ్య తదితరులు పాల్గొన్నారు.

ముకుందాపురంలో చోరీ

నిడమనూరు, జూలై 19: ముకుందాపురం గ్రామంలో ఓ ఇంట్లో దొంగతనం జరిగింది. ఇంట్లో ఎవరూ లేని సమయంలో గుర్తు తెలియని దొంగలు ఇంటి తాళాలు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి బీరువాలో ఉన్న బంగారు, వెండి ఆభరణాలతో పాటు నగదు కూడా అపహరించారు. ఎస్ఐ గోపాల్‌రావు తెలిపిన వివరాల ప్రకారం.. ముకుందాపురం గ్రామానికి చెందిన షేక్ ఉస్మాన్ దంపతులు ఈ నెల 14వ తేదీన మిర్యాలగూడ మండలం రుద్రారం గ్రామంలోని బంధువుల ఇంటికి వెళ్లారు. ఇంటి వద్ద వారి కుమారుడు సయ్యద్ ఉన్నాడు. కానీ 17వ తేదీ సాయంత్రం సయ్యద్ కూడా తల్లిదండ్రులు పిలవగా రుద్రారం వెళ్లాడు. శుక్రవారం ఉదయం సయ్యద్ ఇంటికి వచ్చి చూడగా ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. లోనికి వెళ్లగా బీరువా తెరిచి ఉంది. అందులో చూడగా 12 తులాల బంగారు, 15 తులాల వెండి ఆభరణాలతో పాటు రూ.73 వేల నగదు కూడా గుర్తు తెలియని దొంగలు అపహరించినట్లు గుర్తించి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చాడు. ఉస్మాన్ నిడమనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. హాలియా సీఐ జనార్ధన్‌గౌడ్, ఎస్ఐ గోపాల్‌రావు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ప్రత్యేక అలంకరణలో కాళికామాత

నకిరేకల్, జూలై 19: నకిరేకల్‌లో ఈ నెల 21న స్వయంభు కాళికామాత అమ్మవారికి ఆషాడమాస బోనాలు సమర్పిస్తున్నందున శుక్రవారం పంచామృత ఫలరసాలతో అభిషేకం, మట్టి గాజులతో అమ్మవారిని అలంకరించారు. అష్టోత్తర శతనామార్చన, మహానైవేద్యం, హారతి, గోత్రనామార్చన, పూజలు, మహిళలచే కుంకుమ పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బ్రహ్మదేవర రవిశంకర్, కందాళ లక్ష్మీనారాయణరెడ్డి, గర్రె మురళిమోహన్, వైవైరెడ్డి దికొండ ప్రకాష్, కొండేటి శ్రీను, ప్రవీణ్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

